శ్రీ శుకబ్రహ్మాశ్రమము

Sri Sri Sri Vidyaprakasanandagiri Swamiji

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శ్రీ కాళహస్తి.

ఆశ్రమ ముఖద్వారము

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాముల వారు



శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామివారి సమాధి మందిరంలో ఆరాధన

శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామివారి సమాధి మందిరంలో భక్తులు

శ్రీశ్రీశ్రీ విద్యా స్వరూపానందగిరి స్వామీజి

మెడికల్ క్యాంపుకు వచ్చినవారు

శ్రీ విద్యాప్రకాశానందస్వామి స్మారక మెడికల్ క్యాంపు
ఇందు ప్రతినెల నాల్గవ ఆదివారంనాడు అలోపతి డాక్టర్లు, రెండవ ఆదివారంనాడు ఆయుర్వేద డాక్టర్లు,
మూడవ ఆదివారం నాడు హోమియోపతి డాక్టర్లు ఉచితంగా వైద్యం చేస్తారు.

శ్రీ శుకబ్రహ్మాశ్రమము - దాని సేవా కార్యాలు

శ్రీ శుకబ్రహ్మాశ్రమము దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరుజిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి పట్టణంలో సువర్ణముఖి నదీతీరంలో వుంది. ఈ శ్రీకాళహస్తి విశ్వవిఖ్యాత తిరుపతి నుండి 34 కిలోమీటర్ల దూరంలో తిరుపతికి ఈశాన్యదిశలో వుంది. ఇది గూడూరు – రేణిగుంట జంక్షన్ల మధ్య రైలుమార్గంలో గూడూరుకు 60 కిలోమీటర్ల దూరంలో వుంది. కలకత్తా – చెన్నై రాష్ట్రీయ రహదారి నెంబరు 5లోగల నాయుడుపేటకు నైరుతిగా, నాయుడుపేట తిరుపతిదారిలో వుంది.



ఈ శ్రీకాళహస్తి పురాణప్రసిద్ధ క్షేత్రం. ఇది వాయులింగం. ఇచ్చట రాహుకేతుదోషంగలవారు తన్నివారణార్థం పూజలు చేసుకుంటారు. శ్రీకాళహస్తీశ్వర దేవస్థానానికి దక్షిణంగా సువర్ణముఖినదికి తూర్పు ఒడ్డున ఒక కిలోమీటరు దూరంలో అనేక ఫలవృక్షాలుగల వనంలో ఈ శ్రీశుకబ్రహ్మాశ్రమం వుంది.

ఆశ్రమ స్థాపన

పరమహంస పరివ్రాజకాచార్య పూజ్యపాద 108 శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు క్రీ॥ శ॥ 1950 సంవత్సరం, ఫిబ్రవరి నెలలో విరోధినామ సంవత్సరం మాఘశుద్ధ విదియనాడు ఈ ఆశ్రమాన్ని స్థాపించారు. దీని ప్రారంభోత్సవం శ్రీస్వాములవారి గురుదేవులు, శ్రీవ్యాసాశ్రమ (చిత్తూరుజిల్లా, ఏర్పేడు మండలం) సంస్థాపకులు పరమహంస పరివ్రాజకాచార్యవర్య పూజ్యపాద 108 శ్రీ అసంగానందగిరి స్వాములవారు అనే శ్రీమహర్షి సద్గురు మలయాళస్వాముల వారు చేశారు.



ధ్యానమందిరము

ఈ ఆశ్రమంలో ఆధ్యాత్మిక సాధన చేసుకొనే విరక్త సాధువులకు నివాస, భోజన వసతులు గలవు. ఆశ్రమ దర్శనానికి వచ్చి పోయే భక్తుల నివాసానికి 10 రూములు గల ఒక అతిథి భవనం గలదు. ఆశ్రమంలోనే కొంతకాలం వుండి ఆధ్యాత్మిక ప్రశాంత జీవనం గడుపుకోదలచిన వానప్రస్థులకు నివాస వసతిగలదు. భగవద్గీతను నిర్దుష్టంగా నేర్పు గీతాపాఠశాల గలదు. ప్రతిరోజు యోగాసనాలు, ధ్యానము, ప్రాణాయామము నేర్పు యోగ విభాగము గలదు. పట్టణంలోని వారు ప్రతిరోజు ఉదయం వచ్చి ఇందు యోగసనాలు నేర్చుకొని పోవుచుందురు.

ఆశ్రమంలో నర్మదేశ్వరమహాదేవుడను శివలింగంగల శివాలయం గలదు. ఇందు ప్రతినిత్యం అభిషేకం, మూడు కాలాల పూజ జరుగుచున్నది. ప్రతినిత్యం ఉదయం గీతాపారాయణ, సాయంకాలం సత్సంగం, రాత్రి భజన ఈ శివాలయంలో జరుగుచున్నది. ప్రతి నిత్యం ధ్యానం చేసుకొనుటకు మంచి ధ్యానమందిరం గలదు.

కొన్నివేల ఆధ్యాత్మిక గ్రంథాలుగల వేదవ్యాస గ్రంథాలయం (లైబ్రరీ) ఇచట గలదు. పూజ్యశ్రీ గురుదేవులు రచించిన గీతామకరందం, యోగవాసిష్ఠరత్నాకరాది గ్రంథాల ప్రచురణ - ప్రకాశక విభాగం కలదు. భక్తకన్నప్ప కంటి ఆస్పత్రి గలదు. ఆనంద వైద్యాలయం అను పేర ఒక వైద్యశాల గలదు. ఇట్లు ఆశ్రమం భక్తులకు, జిజ్ఞాసువులకు భక్తి, ముక్తి మార్గదర్శకంగా విరాజిల్లుతుంది.

ఆశ్రమంలో నిత్యకార్యాలు

ఆశ్రమంలో ప్రతిరోజు అభిషేక అర్చనానంతరం ఉదయం 5 గంటల 30 నిమిషాలకు శివాలయంలో హారతి జరుగును. అనంతరం సమిష్టి జపము, ధ్యానము 6 గంటల వరకు జరుగుతుంది. 6 గంటల నుండి భగవద్గీతాపారాయణ జరుగుతుంది. సాయంకాలం 4 గంటల నుండి 5 గంటల వరకు సత్సంగం (ప్రవచన) జరుగుతుంది. ప్రతినెల కృత్తిక, మాస శివరాత్రులలో ప్రదోషకాలంలో ప్రత్యేక పూజ జరుగుతుంది. ప్రతి ఏకాదశి నాడు భగవద్గీత పూర్తిపారాయణ, ప్రతి పౌర్ణమినాడు గురుపాదుకల పూజ, ప్రతి సోమవారం శివసహస్రనామ పారాయణ, శుక్రవారంనాడు లలితాసహస్రనామ పారాయణ, ప్రతి శనివారం విష్ణు సహస్రనామ పారాయణ జరుగుతుంది. శ్రీరామనవమి, శంకరజయన్తి, కృష్ణాష్టమి వగైరా పర్వదినాలలో ఆయా ప్రత్యేక పూజలు జరుగుతాయి. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ చతుర్దశినాడు ప్రారంభించి చైత్ర బహుళ చవితి వరకు ఐదురోజులు పూజ్య గురుదేవులు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి ఆరాధనోత్సవాలు విశేషంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలలో సుప్రసిద్ధ మహాత్ముల ప్రవచనాలు వుంటాయి. సాంస్కృతిక కార్యక్రమాలు వుంటాయి.

విద్యారంగంలో ఆశ్రమ పాత్ర

గీతా ప్రవచనాలు

జిల్లాలోనే రెండే రెండు కళాశాలలుగల కాలంలో 1966 సంవత్సరం పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు భూరి విరాళమిచ్చి ఈ శ్రీకాళహస్తి పట్టణంలో "శ్రీస్వామి విద్యాప్రకాశానంద ఆర్ట్స్ మరియు సైన్స్ డిగ్రీ కళాశాల"ను ప్రారంభింపచేశారు. (ఆనాడు ప్రయివేటు కళాశాలలకు అనుమతిలేదు). ఇది జిల్లాలోనే 3వ కాలేజి. అట్లే 1988 సంవత్సరం శ్రీ స్వాములవారు భూరివిరాళమిచ్చి బాలికలకు "శ్రీస్వామి విద్యాప్రకాశానంద జూనియర్ బాలికల కాలేజి"ని ప్రారంభింపజేశారు. ఇట్లు పరిసర గ్రామాల పిల్లలకు (కాలేజి) కళాశాల విద్యనభ్యసించు అవకాశాన్ని పూజ్యశ్రీ స్వాములవారు చేశారు.

ఆరోగ్య-వైద్య సేవలో ఆశ్రమ పాత్ర

ఆ సమయంలో శ్రీకాళహస్తి పట్టణంలోనే ప్రభుత్వ చిన్న వైద్యశాల, కేవలం ఇద్దరు ప్రైవేటు (ఎం.బి.బి.ఎస్) డాక్టర్లున్న కాలం. పట్టణం చుట్టూ నిరుపేద గిరిజనులు. పట్టణ పరిసరాలలోగల చాల నిరుపేద గిరిజనుల చికిత్స నిమిత్తం 1961 సంవత్సరం ఆనంద వైద్యాలయం అను పేరుతో ఒక చికిత్సాలయాన్ని ఆశ్రమంలో ప్రారంభించారు. పట్టణమంతా డాక్టర్లతో నిండియున్న నేడు కూడా ఈ చికిత్సాలయం బీదలకు ఏలాంటి శుల్కం తీసుకోకుండా ఉచితంగా మందులిస్తూంది. చికిత్సలు చేస్తూంది. సంవత్సరానికి సుమారు 9 వేల మంది రోగులు ఈ ఆనంద వైద్యాలయం నుండి ఏలాంటి పైకం చెల్లించకుండా చికిత్సలను పొందతున్నారు. ఈ 2009

సంవత్సరంలో 8879 మంది ఇందు చికిత్సలు పొందినారు.

ఆశ్రమంలో 1994 సంవత్సరం భక్తకన్నప్ప ఉచిత కంటి ఆసుపత్రిని శ్రీస్వాములవారు ప్రారంభించినారు. అందిప్పుడు వారానికొక రోజు 25 మందికి ఉచితంగా కంటి పొరల ఆపరేషన్ చేయబడి కంటిలో లెన్సు అమర్చబడుతున్నవి. ఇప్పటికి 14,678 మందికి కంటి పొరలు తీసి లెన్సు అమర్చబడినవి. 166910 మందికి ఓ.పిలో కంటి పరీక్షలు చేయబడి చికిత్సలు చేయబడినవి. గ్రామాలలో ఇప్పటికి 186 కంటి వైద్య శిబిరాలు జరిగాయి. అందు 14,682 మందికి కంటి పరీక్షలు చికిత్సలు జరిగాయి.



కంటి ఆస్పత్రి

ఆశ్రమంలోని సద్గురు సర్వసేవాట్రస్టుచే గ్రామాల్లో వైద్యసేవా శిబిరాలు నడుపబడుతున్నవి. ప్రతి నెలలో మొదటి ఆదివారం వివిధ రోగాలపై స్పెషలిస్టులైన డాక్టర్లను గ్రామాలకు తీసుకుపోయి గ్రామంలోని రోగులకు వైద్యం చేయబడుతుంది. 2001 సంవత్సరము నుండి ఇప్పటికి 54 గ్రామాలలో వైద్య శిబిరాలు జరిగాయి. 19,308 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేయబడి ఉచితంగా మందులివ్వబడినవి.

ఆధ్యాత్మిక ప్రచారం

పరమ పూజ్యశ్రీ స్వాములవారు (గురుదేవులు) ఒక్కొక్క గీతాజ్ఞానయజ్ఞం 18 రోజుల ప్రవచన వంతున వివిధ పట్టణాలలో 108 గీతాజ్ఞానయజ్ఞాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ అంతటానేగాక, చెన్నై, బొంబాయి, షోలాపూర్, బెంగుళూరు, మైసూరు వంటి ఇతర రాష్ట్ర, పట్టణాలలో గూడ ఈ గీతాజ్ఞానయజ్ఞాలు, ప్రవచనాలు చేశారు. ప్రతిచోట వేలకు వేల జనం శ్రోతలు చాలా ఆసక్తితో ఈ ప్రవచనాలను వినేవారు. వైశిష్ట్యాన్ని శ్రీ స్వాములవారి ఈ గీతా ప్రవచన జనరంజకాన్ని చూచి తిరుమల తిరుపతి దేవస్థానం వారు చివరలో గీతాయజ్ఞాల నిర్వహణను తమ భుజస్కందాల కెత్తుకున్నారు. శ్రీస్వామి వారి 18 రోజుల గీతాప్రవచనాలను యథాతథంగా వీడియోలు తీసి వి.సి.డి.లను, సి.డి.లను విక్రయించి ప్రచారం చేస్తున్నారు.

పూజ్యశ్రీ స్వాములవారు గీతాజ్ఞానయజ్ఞాలేగాక 58 గీతాసదస్సులను గూడ జరిపారు. పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి భగవద్గీతకు వ్యాఖ్యానం గీతామకరందం ఒక విశిష్ట వ్యాఖ్యానం. పండితులకు, పామరులకున్ను చాల ఉపయోగకరమై లోక ప్రసిద్ధమైంది. దేశవిదేశాలలో బహుళ వ్యాప్తమైంది. ఈ గ్రంథం (తెలుగు) ఆంగ్లం, కన్నడం, హిందీ, తమిళ భాషలలో కూడ అనువదింపబడి బహుళ ప్రచారంలో వుంది.

ఈ ఆశ్రమం శ్రీకాళహస్తి దేవాలయం నుండి ఒక కిలోమీటరు దూరంలో వుంది. దేవాలయానికి పడమర నదీ తీరంలోగల సిమెంటు రోడ్డు ఆశ్రమం వరకు వుంది. ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు కూడా వచ్చే పోయే విశాలమార్గంగా వున్నది. నిర్ణీత సమయాలలో ఆర్టీసి బస్సులు కూడా ఆ దారిలో పోతూంటాయి.

ఆశ్రమ సంస్థాపకులగు పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు తనకు 82 సంవత్సరాల వయస్సుయి నందు వలన తన ఉత్తరాధికారిగా సంస్కృతంలో వేదాన్తశాస్త్రి, ఎం.ఏ, హిందీలో సాహిత్యరత్న (ఎం.ఏ.) పట్టభద్రుడైన చిన్నప్పటి నుండి తనవద్ద బ్రహ్మచారిగా వుండి ఆశ్రమసేవ చేసి తనచే సంన్యాసమివ్వబడిన పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారిని 1996 సంవత్సరంలో నియమించారు. ఆ తరువాత 1998 సంవత్సరం ఏప్రిల్ 10వ తేది చైత్రశుద్ధ చతుర్దశినాడు శ్రీవారు బ్రహ్మలీనులైనారు. శ్రీవారి సమాధి ధ్యానమందిరం అను పేరుతో చాలా సుందరంగా నిర్మింపబడివుంది. ఆశ్రమ ప్రస్తుత పీఠాధిపతులు తన ఉత్తరాధికారిగా కాశీలో వేదాన్తాచార్య పట్టభద్రులైన స్వాములవారిని పూజ్యశ్రీ సంపూర్ణానందగిరి స్వాముల వారిని నియమించారు.

శ్రీ సద్గురు విద్యాప్రకాశానందగిరిస్వాములవారి జీవిత సంగ్రహము

- పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

రత్నగర్భయని పేరుగన్నది భారతదేశము. జ్ఞాన తేజోవిలసితులగు 'ఆధ్యాత్మికరత్నము'లను కన్నకడుపుగాన భారతమాతకా పేరెంతేని తగియున్నది. అవ్యయమై, అనంతమై, సచ్చిదానంద స్వరూపమైనట్టి బ్రహ్మము యొక్క అనుభూతిని, దైవానుభూతిని పొంది ఆధ్యాత్మిక రాజ్యమున నిరంకుశముగ ప్రవర్తించిన మృత్యుంజయుల కిది పుట్టినిల్లు. కనుకనే మాక్సుముల్లరు వంటివారు భారతదేశమున జన్మించుటే మహాభాగ్యమని యెంచి దానికై తపించిరి. "కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షత్, ఆవృత్తచక్షుః అమృతత్వ మిచ్ఛన్" అన్న శ్రుతిరీతి అమరులగుధీరులు. మహాత్ములుండుటచేతనే నేటికిని ఈ భారతదేశము సర్వప్రపంచమునకు మాన్యమై యొప్పుచున్నది. సచ్చిదానంద దైవధ్యానముచే దైవరూపులైన మహాత్ములు 'స్వయంతీర్ణః పరాంస్తారయతి' అన్నట్లు ఆశ్రితజనులను గూడ తరింపజేయుచున్నారు. ఇట్టికోవకు చెందిన వారు శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు.

వీరు భారతమునకు ధాన్యాగార మనబరగు ఆంధ్రదేశమున పవిత్ర కృష్ణవేణీ నదీమతల్లిచే పునీతమైన ప్రదేశమగు కృష్ణాజిల్లా మచిలీపట్టణమునందు పవిత్ర వైదిక జీవులును, ఆదర్శగృహస్థులును, ఆర్షధర్మమూర్తులు యగు శ్రీ తూనుగుంట్ల రామస్వామి, సుశీలాదేవి అను పుణ్యదంపతులకు లోకమునకు దుఃఖరాహిత్యము, ఆనందప్రాప్తి చేకూర్చుటకు ఆనందనామ సంవత్సర చైత్ర బహుళ తదియ సోమవారమునకు సరియగు 1914వ సంవత్సరము ఏప్రిల్ 13వ తేది అనూరాధా నక్షత్రం ప్రథమపాదమున ఉదయం 8 గంటలకు జననమందిరి. ఆ దినము కాకతాళీయముగా సౌరసంవత్సరాది (అరవసంవత్సరాది) యగుటచే జనులు ఆనందముగ వేడుకలు చేసికొనిరి.

వీరి జననీజనకులు చాల దైవభక్తిపరులు. తండ్రిగారు గొప్ప ప్రజ్ఞాశాలి. వారు బి.ఎ., బి.ఎల్ చదివి ప్రఖ్యాత న్యాయవాదిగా నుండిరి. వారు గొప్ప వైదిక ధర్మజీవులు. వారు వేద విజ్ఞానమందు సునిశిత పండితులు. అంతేగాక లోకమున వేదప్రతిపాదిత ధార్మికజీవితమును, గార్హస్థ్య జీవితమును ఆదర్శముగా గల్గినవారు.

కావుననే తమ సత్యజీవితమునకు, ఆధ్యాత్మిక ప్రవృత్తికి లాయరు వృత్తి అడ్డురాగా దానిని అవలీలలగా వదలిపెట్టిరి. అంతేగాక వీరు వేదప్రతిపాదిత ధర్మమున కనుకూలముగా సంఘమును సంస్కరించుటలో చాలా గణనీయమైన కృషిచేసిరి. వీరు తమ ఇంటిని విజయవాడలో ఇంద్రకీలాద్రి వద్ద నిర్మించి ఒక పవిత్ర ఆశ్రమంగా, తపోవనముగా నుంచుకొనిరి. వీరు ప్రస్థానత్రయమును భాష్యసహితముగా పూజ్యశ్రీ కళ్యాణానంద భారతీస్వామివారి వద్ద అధ్యయనము చేసిరి. ఇట్టి పవిత్ర జీవులకు పుత్రులుగా పుట్టిన మన స్వాములవారు పుట్టుకతోనే పవిత్రులగుట సహజమే కదా!

ఆనందనామ సంవత్సరమున పుట్టుటచేత వీరికి తల్లిదండ్రులు "ఆనందమోహన్" అనిపేరు పెట్టిరి. పూవుపుట్టగానే తన పరిమళమును వెదజల్లునట్లు వీరు బాల్యము నుండియు చక్కని కుశాగ్రబుద్ధి కలవారై, ఆధ్యాత్మిక ప్రియులై యుండిరి. వీరు చిన్ననాటి నుండి విజయవాడ యందలి ఓంకార నిలయమును తమ గృహరూప ఆధ్యాత్మిక పాఠశాలయందు గణనీయమైన చక్కటి ఆధ్యాత్మిక వాతావరణములో పెరిగి

పరాపరవిద్యలందు తమ ప్రతిభను సమముగ ప్రదర్శించుచు వచ్చిరి.

తండ్రి గారి ప్రోత్సాహముతో వీరు నిత్యము నిద్రలేచినదే తడవుగా ప్రార్థన సమిష్టిగా చేసి 4 గంటలకు కృష్ణానదిలో స్నానంచేసి ఆపైన గీతాపారాయణము చేయువారు. ప్రతి ఆదివారము ఇంటిలో తండ్రిగారు చెప్పుచుండిన పంచదశి, జీవన్ముక్తి ప్రకాశికాది గ్రంథముల పాఠమందు పాల్గొనువారు. ఇట్లు ఈ ఆనందమోహనులు చిన్ననాటనే ఆధ్యాత్మిక సాహితీప్రవేశమును పొందిరి. వీరు పిన్నవయస్సుననే తండ్రిగారిచే నేర్పబడిన భర్తృహరి సుభాషితమలు, శ్రీ శంకరుల ప్రశ్నోత్తరి, ఆత్మబోధ, ఉత్తరరామచరితము, గాయత్రీ రామాయణము మొదలగునవి చెప్పుచుంటే జనులు ఆనందముతో తన్మయులగువారు. గొప్ప సమావేశములందు వీరు మహాసంకల్పము, చూర్ణిక, ఆశీర్వాదములు మొదలగు వేదమంత్రములను సస్వరముగా చెప్పి వాటి అర్థమును విశదీకరించుచుండ సభ్యులు విని ఆశ్చర్యముతో హర్షధ్వానములు చేసి మరల మరల చెప్పమనుడివారు.

విజయవాడ ఉన్నతపాఠశాల యందు ప్రతి తరగతిలోను ప్రతి విషయమునందును ప్రథమబహుమతి వీరిదే. వీరి గృహములో తండ్రిగారేర్పరచిన నియమానుసారము ప్రతిరోజు 500 గంజములు నూలువడికి వారివారి (ఖద్దరు) వస్త్రములకు తగు నూలును వారే సమకూర్చుకొనెడివారు. అటు పిదప ఖద్దరు గుడ్డలు, గాంధీటోపి ధరించి తన సహోదరీ సహోదరులతో కలసి జెండా చేతబట్టి విదేశవస్త్ర బహిష్కరణాదులందు పికెటింగ్ చేయుచు (చిన్నమూర్తి) ఖాదీని గూర్చి ఉపన్యసించుచుండ బజారులోని శ్రోతృప్రజలు భళీ! యని మెచ్చెడివారు. ఇట్లు వారు ఆ చిన్నవయస్సున ఆధ్యాత్మిక సాహిత్యము నొకప్రక్కన, వేదమంత్రములను, ఉపనిషత్తులను ఒకప్రక్క, తన పాఠశాలా గ్రంథముల నొకప్రక్క చదువుచు అందు ప్రథమమున నెగ్గుచు మరియొక వైపు దేశసేవయందును తమ కర్తవ్యమును ఆనందముగ నెరవేర్చుచుండట చూచి అందరును ఇతడు సామాన్యుడు గాడని ఆపుడే చెప్పెడివారు. వీరికి పరోపకారము, దయ, కరుణ ఉగ్గుపాలతో అబ్బినవి. చిన్ననాటి నుండియు ఒక చీమయైనను నీటబడియున్నచో చూచి సహించలేరు. వెంటనే అన్ని పనులు వదలి దానిని బయటపడవేయు చుండిరి. వీరి గృహమున దీపావళికి 108 జ్యోతులతో ఓంకారమును నిర్మించి దానికి ప్రణవాష్టోత్తర శతనామములతో అర్చన చేయుదురు. వీరి కదియే ఆనందము. కాన వారి తండ్రిగారి "టపాసులు వగైరాల (బాణాసంచా) కాల్చరా" దను నియమమును ఎప్పుడును ఉల్లంఘించి ఎరుగరు. ఆ దీపావళికి వీరి గృహ మొక వైకుంఠముగనే యుండును. వీరి గృహము నందు ఆదివారము నాడు అపక్వాహారము అనగా పండ్లు, పచ్చికూరలు వగైరాలే తినవలెను అను నియమము గలదు. దానిని అతి ఇష్టముతో వీరు అమలుపరచుచుండెడివారు.

మానవునకు ద్విజత్వమును కల్గించు సంస్కారమే ఉపనయనము. ఇది వేదాధ్యయనమునకు యోగ్యతను కల్గించును. ఈ వేదములు సర్వశాస్త్రములకు, ధర్మములకు మూలములు. ఈ వేదమల నుండియే మానవుని కిహపర శాంతి సుఖములనిచ్చు సర్వసాధనలు బయలు వెడలుచున్నవి. మానవుని మాధవునిగా జేయు విద్య ఇందే గలదు. మానవోన్నతికి వలయు సాధన ప్రక్రియలో ఉపనయనము మొదటిమెట్టు. 'జన్మనా జాయతే శూద్రఃకర్మణాజాయతే ద్విజ' అన్నట్లు ఈ ఉపనయన కర్మ చేతనే మానవునకు ద్విజత్వము గలుగుచున్నది. అనగా ఈ ఉపనయనముచే గాయత్రీ మంత్రోపదేశము నొంది తజ్జపముచే విగతపాపుడై, అగ్న్యుపాసనచే దివ్యతేజోపలబ్ధిని బడసి, బ్రహ్మచర్య నియమములచే జితేంద్రియుడై మనుజుడు శుద్ధసత్త్వమునొందును. అపుడు ప్రాకృత జీవనము పోయి దివ్య జీవనమబ్బును. అట్టి ఉపనయనము శ్రీస్వాములవారికి 10 సంవత్సరాల వయస్సులో చతురాహ్నికముగ వేదాశ్రాస్త విధి ననుసరించి నిరాడంబరముగ జరిగినది. నాడు శాస్త్రోక్తమగు బ్రహ్మచారి రూపమును ధరించి ఆనందుడు ముచ్చటగా ఆనంద మోహనుడయ్యే యుండెను. ఆహా, ఏమి ఆ తల్లిదండ్రుల శిక్షణ! ఏవి ఈ వటుని ఆదర్శ ప్రియత, వైదిక నిష్ఠ. కావుననే నేడు ఆచార్యత్వము సిద్ధించినది. ఈ బ్రహ్మచారిగారు ఒకనాడు దండకమండలములతో

కుశహస్తులై పలాశదండాజినధారులై వేదప్రతిపాదిత బ్రహ్మచర్య ధర్మములను గూర్చి వేటపాలెం సారస్వతనికేతన సభయందు ఉపన్యసించుచుండ నాటి సభకు అగ్రాసనాధిపతియగు శ్రీ కాశీకృష్ణమాచార్యులవారు (ఆంధ్ర ఆస్థానకవి) ఈ బాలుడు సామాన్యుడు గాడు. గొప్ప మహాత్ముడు కానున్నాడని తమ భావావేశమును ఆ సభలో ప్రకటించియున్నారు. వీరు (ఆనందమోహనులు) ఇట్లు పరాపరవిద్యలయందు సర్వాగ్రగణ్యులై ముందు కురుకుచు అభివృద్ధినొందుచు తమ 13వ ఏట ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షయందు (ఉత్తమశ్రేణి యందు) ఉత్తీర్ణులైరి. ఆ తరువాత మచిలీపట్టణమందలి నోబుల్ కాలేజీలో చేరి ఉత్తమ కక్ష్యలో బి.ఎ. పట్టభద్రులైరి. అచట కాలేజీలో చదువునపుడు ఆఖరు సంవత్సరమున తమ 17వ ఏట వీరు అపక్వాహారమును ప్రారంభించి ఆధ్యాత్మిక సాధనల కుపక్రమించిరి. సమీపస్థ అన్నపూర్ణస్వామివారి మఠమునకు వెళ్ళి రోజూ సాయంస్నానముచేసి జపధ్యా నములు చేయుట వీరికి పరిపాటియైనది.

ఇట్లు వీరు తమ కళాశాల విద్యాభ్యాసమును సాగించి పూర్తిచేసిరి. వీరు భగవద్గీత నిదివరలోనే చదివియుండుటచే బైబిలును ఇష్టగ్రంథముగా తీసికొని పూర్ణముగా చదివి, ఈ కళాశాలల జీవితములోనే వీరు ఆంధ్రదేశ్ భగవద్గీత పోటీలయందు ద్వితీయ బహుమతిని, నోబుల్ కాలేజీవారి "భగవద్గీత–బైబిల్" వ్యాసరచన యందు ప్రథమ బహుమతిని, ఏలూరు కాంగ్రెసు జ్యూబిలీ పోటీలలో నూలువడుకుటయందు ప్రథమ బహుమతిని, విజయవాడలో కాంగ్రెసు స్వర్ణోత్సవ మందు చరఖా, తకిలీ పోటీ (నూలువడుకుట) లందు ఉ పన్యాస పోటీలయందు ప్రథమ బహుమతులను (సువర్ణ పతకములను) పొందియున్నారు.

గురుసన్నివేశము - సమర్పణము

ఇట్లు విద్యాభ్యాసము చేయుచున్న సమయమున ఆంధ్రదేశమునకు ఆధ్యాత్మిక భిక్షాదాతలును, జ్ఞానభాస్కరులును, తపోమూర్తియునగు శ్రీమహర్షి మలయాళస్వాములవారు తమ ఆధ్యాత్మిక ప్రచార సందర్భమున శ్రీ ఆనంద మోహనుగారి గృహమునకు వారి తండ్రిగారి ఆహ్వానము ననుసరించి వచ్చిరి. సాధుమహాత్ముల సత్కారానంతరము సాయంకాలమున శ్రీవారి ప్రసంగము ఏర్పాటు చేయబడెను. అపుడు శ్రీ మలయాళ స్వాములవారు ఆ గృహమును జూచి "నివృత్తిరాగస్య గృహం తపోవనమ్" అను సూక్తిరీతి నిజముగా "ఇది తపోవనముగనే యున్నదని" నుడివి వారి కుటుంబ ధార్మిక, ఆదర్శ, ఆధ్యాత్మిక జీవితమున కచ్చెరు వందిరి. ఆ సందర్భమున శ్రీరామస్వామి గుప్తగారికి తమ పిల్లలలో ఒకరిని ఆధ్యాత్మిక క్షేత్రమున నివృత్తిపరునిగా జేయవలెనను సత్సంకల్ప మొదవెను. అంతట నాడు దేశమున గణనీయ మహాత్ములలో శ్రీమలయాళస్వాముల వారగ్రగణ్యులుగా నుండుటచే వారికే తమ పుత్రులలో నొకరిని నివృత్తి ధర్మావలంబనకై సమర్పించ నిశ్చయించి అందుకు తగినవారు (పంచపాండవులవలె) తన పుత్రులైన ఐదుగురిలో ఎవరా యని పరికించ అందుకు తగు సంస్కారము గలిగి అందరికన్న మిన్నయై (పాండవ మధ్యమునివలె) శోభించు తమ మూడవ పుత్రరత్నమగు ఈ ఆనందమోమనులే తగుదురని తలంచి వారికి తమ కోర్కె నెఱిగించిరి. వెంటే మన చరిత్రనాయకుడందుకు కడు మోదముతో తమ ఆమోదమును తెలుప తత్క్షణమే ఆ బహిరంగ సమావేశమున శ్రీరామస్వామిగారు తమ తృతీయ పుత్రుడగు శ్రీ ఆనందమోహనులను భావికాలమున లోకమును ఆనందముతో మోహింప జేయుటకై శ్రీ మహర్షి మలయాళ స్వాములవారికడ (నివృత్తి ధర్మ శిక్షణ నిమిత్తమై) సంపూర్ణముగా సమర్పించివైచిరి. ఆహా! ఆ పుణ్యసందర్భ మెంత కనుల కింపుగా నుండెనో గదా? ఆ సందర్భమున జగద్గురువులగు శ్రీ మలయాళ సద్గురువుల మనంబు 'సచ్ఛిష్యుడు చిక్కెనుగదా! యని ఆనందడోలికల నూగుఆడ, కన్నులందు ఆనందాశ్రువులు జలజల రాలుచుండ తమ హర్షాతిశయమును నా సభాసమ్ముఖమున ప్రకటించి యున్నారు. నిజముగ ఆ సన్నివేశము, ఆ సమర్పణ ఘట్టము భారత చరిత్రలో సువర్ణాక్షరములతో లిఖింపదగినది.

సద్గురువు - మంత్రోపదేశము

ఈ సందర్భమున శ్రీ సద్గురు మలయాళస్వాముల వారిని గూర్చి కొంత తెలిసికొందము. శ్రీ మహర్షి మలయాళ స్వాములవారు నిజముగ సద్గురువులే. ఆంధ్రుల సమిష్టి పుణ్యప్రాభవముచే ఆంధ్రుల నుద్ధరింప దివినుండి బువికేతెంచిన వ్యాసమహర్షియే వీరు. ఆ ధీరగంభీర మూర్తిమత్వము, తపోగ్నిచే పవిత్రమైన శరీరము, జ్ఞానతేజోవి లసితత్వము చూపరులకట్లే భక్తిభావము కలిగింపజేయును. వీరిని గూర్చి మన స్వాములవారు పలికిన మాటలనే మనము పేర్కొందము "గురువులు దొరకవచ్చును గాని సద్గురువులు దొరకుట చాల దుర్లభము. శిష్యులను సద్వస్తువగు ఆత్మయొద్దకు చేర్చువాడే సద్గురువు. సచ్ఛీలమును వాక్కునందేగాక అనుష్ఠానము నందును దిగ్దర్శన మొనర్చువాడే సద్గురువు. భగవాను డెన్నుకొనిన ఏ కొలదిమంది మహనీయులో అట్టి సద్గురుపీఠమలంకరించి లోకములో విరాజిల్లుచుందురు. అట్టి వారిలో నొకరు శ్రీ సద్గురు మహర్షి మలయాళ స్వామువారు. ఆధ్యాత్మిక విషయములయందు పండిన యనుభవముగల మహనీయుడగుట వలనను, పారమార్థిక సూత్రము లన్నియు వారికి కాచి వడపోసినవే అయియుండుట వలనను, భక్తులకు వారి సాన్నిధ్యమందు నిగూఢ దైవతత్త్వావగాహనము సులభతర మనిపించుచుండెడిది" ఇయ్యది తన గురుదేవుల గూర్చి శ్రీవారి సరియైన చిత్రణ. ఇట్టి పావన మూర్తియైన సద్గురు శ్రీమహర్షి మలయాళస్వాములవారు తనకు తగిన పవిత్ర శిష్యుడు చిక్కినంతనే పుత్రోత్సాహము నందిన తల్లివలె అమితానంద భాజనులైరి. ఆ సమర్పణ ఘట్టమును, ఆ గృహములోని తపోజీవనమును, తన నూతన శిష్యుని బుద్ధికుశలతలను, ప్రజ్ఞాపాటవలములను అంతకుమించి ఆధ్యాత్మిక జీవనమును తలంచివారు ఆనందముతో నుప్పొంగి పోయెడివారు.

తదుపరి ఆనందమోహనులవారికి శ్రీ సద్గురువులవారు 1932వ సంవత్సరమున శుభముహూర్తమందు పంచాక్షరీ మంత్రోపదేశము నొనరించిరి. ఇంతఃపూర్వమే సంస్కృతజ్ఞానము గల్గి, ఉపనయన సంస్కారము నొంది, గాయత్రీ జపముచే నిర్ధూతకలమషుడై, ద్విగుణీకృత తేజము నొందియుండిన ఆనందమోహన్ ఇపుడు గురూపదిష్ట పంచాక్షరీ మంత్రముచే పరిపూర్ణ శుద్ధాంతఃకరణుడై భాస్కరునివలె బ్రహ్మతేజముతో వెల్గొందదొడంగెను. 1930 సంవత్సరము నుండి అపక్వాహారముతో జీవించుచు ఆధ్యాత్మిక సాధనలు చేసి యుండుటచేత మాలిన్యరహితులైరి. ఇపుడు గురూపదిష్ట మంత్రమందు లక్ష్యముంచి జపధ్యానాదులు తీవ్రముగా జేయదొడంగిరి. ఇట్లు శ్రీవారు పిన్నవయస్సుననే సద్గురులాభము నొంది ఆధ్యాత్మిక సాధనలు చేసికొనుచు లౌకిక విద్యలందు కళాశాలలో మిన్నయై యొప్పుచు ఆంధ్ర విశ్వవిద్యాలయమున 1933వ సంవత్సరమున బి.ఎ. పట్టభద్రులైరి. తదనంతరము ఇపుడున్న సంస్కృత ఆంగ్ల విద్యలేగాక భావిభారత రాజభాషయైన హిందీయందును పాండిత్యము సంపాదించ నుద్యుక్తులై దక్షిణ భారత హిందీ ప్రచారసభవారి రాష్ట్రభాష, విశారదాది పరీక్షలం దుత్తీర్ణులైరి.

కాశీ నివాసము

ఆనందమోహన్ హిందీలో ఆంధ్రదేశములోని పరీక్షలందుత్తీర్ణులై ఉన్నత హిందీ విద్యాభ్యాసానికిగాను 1935వ సంవత్సరంలో కాశీపట్టణానికి వెళ్ళిరి. భారతీయునకు కాశీవాసము పవిత్రకార్యం కదా! కాబట్టి వీరికిన్నీ చిన్నతనమున కాశీవాసయోగ మబ్బినది. అంతట వీరు పట్టభద్రులగు మరికొంతమంది దాక్షిణాత్యులతో కలిసి కాశీ వెళ్ళి ఆట జాతీయముగ నడచుచున్న కాశీవిద్యాపీఠమందు "హిందీ కోవిద" తరగతిలో ప్రవేశించిరి. ఆ కాశీ ప్రయాణమునకు వీరి గురువుగారి ప్రోత్సాహము ముఖ్యకారణమయినది. ఆ కాశీవిద్యాపీఠమున కానాడు ఆచార్య నరేంద్రదేవ్‌గారు ప్రిన్సిపాల్ (ప్రధానాచార్యులు)గ నుండిరి. శ్రీ ప్రకాశ్‌గారు సంపూర్ణానంద్‌గారు, బలబీర్‌సింగ్‌గారు మొదలగు ఉద్దండులు దేశసేవా పరాయణులు అధ్యాపకులుగా నుండిరి. అట్టి ఉద్దాదేశనాయకుల సంచాలకత్వ అధ్యాపకత్వములతో నడచు విద్యాపీఠమందు ఒక సంవత్సరము వీరు విద్యనభ్యసించి "హిందీకోవిద" యను పట్టము నందిరి. కాశీ జీవితము

వీరికి చాల విశిష్టముగా గడచినది. వీరి వసతి గదియందు వీరితోపాటు ఉత్తరప్రదేశ్ ప్రాంతీయుడైన గిరీశచంద్రపంత్ అను నతడు తోడివిద్యార్థియై స్నేహితుడాయెను. అతడు చాలా గొప్ప ప్రజ్ఞావంతుడనియు, ఆధ్యాత్మికముగా చాలా పరిచయము గలవాడనియు శ్రీ వారపుడపుడు నాతో చెప్పుచుండిరి. అట్టివాని సాంగత్యము తోడుకాగా నిప్పునకు గాలితోడైనట్లు వీరి ఆధ్యాత్మిక సాధనలు మరింత వృద్ధినొందినవి. సెలవు దినములలో గంగానదిలో పడవపై విహారమేగి తన్నదీతీరస్థ మహాత్ముల నన్వేషించి దర్శించి వచ్చుట వీరికొక సహజ క్రీడయైనది.

ఈ సందర్భములో ఒక ఘట్టమును వివరించుట సమంజసము. వీరిరువురు (పంతు, ఆనందమోహన్) ఒకనాడు పడవ మీదపోయి గంగానదిని దాటి ఆవలి ఒడ్డున ఉన్న ఒక గ్రామమును చేరిరి. ఆ గ్రామమునందొక ప్రసిద్ధ మహాత్ముడు అవధూతవృత్తి యందుండెను. ఆ మహాత్ముని దర్శనమే వీరి యుద్దేశ్యము. ఆ సత్పురుషుని యనుగ్రహము లభించుట జనులకు బహుదుర్లభమై యుండెను. మన ఆనంద మోహనులు పంతుతో కలసి వారి దగ్గరకు పోయిరి. కాశీ నుండి ఇద్దరు విద్యార్థులు వచ్చినట్లు దగ్గర నున్నవారు చెప్పగా ఆ మహాత్ములు మామూలు ధోరణిలో తిట్టూ వెళ్లిపొమ్మని కేకలు వేసిరి. కానీ వీరు కదలలేదు. పదరలేదు. చేతులు కట్టుకొని నిలబడిరి. ఆపైన దోమతెర పైకి తీసివేసి వీరిని చూచి దగ్గర రమ్మని చెప్పిరి. అప్పటికి సాయం సమయమగుటచేత భక్తుడగు ఒకానొక జమీందారును పిలిపించి "వీరికి రాత్రికి వసతి, భోజనాదులను ఏర్పాటు చేయు" మనిరి. మరియు ఆ యిరువురిలోను మన ఆనందమోహనులను చూపి "ధక్షిణ్ మే ఆధ్యాత్మిక ధూమ్ మచాయేంగా" దక్షిణ భారతమున ఆధ్యాత్మిక క్రాంతిని గల్గింతువు" అని వారిని ఆశీర్వదించిరి. మహాత్ములు త్రికాలజ్ఞులు. వారి వాక్యములు, ఆశీర్వాదములు వ్యర్థములు కావు గదా! కాశీలోని విద్యాపీఠమందు వీరి సంపాదకత్వమున "తపోభూమి" యను హిందీ మాసపత్రిక వ్రాతపత్రులుగా ప్రారంభింపబడినది. దానిలోని వ్యాసములు ఉజ్జ్వలములు. హిందీభాషయందు చక్కని సాహిత్యముగ అవి ప్రకాశించుచున్నవి. కాశీయందు వీరు ప్రాణాయామయోగాస నాదులును బాగుగా సాధనచేసిరి. అచటనే వీరికి రాహుల సాంకృత్యాయనుల పరిచయము, వారి బౌద్ధ గ్రంథముల పరిచయము ఏర్పడినది.

ఇట్లు వీరు ఆధ్యాత్మిక విచారణలతో, ఉత్తమ హిందీ సాహిత్యముతో కాలము గడుపుచుండ ఒకపుడు ఆ విద్యాపీఠమందు కాంగ్రెస్‌కమిటీ సమావేశము జరిగినది. అక్కడికి గాంధీజీ, పటేల్, రాజేంద్రప్రసాద్ మున్నగు నాయకులచటికి విచ్చేసిరి. అపుడు గాంధీమహాత్ముని బసయొద్ద వాలంటీరుగా ఈ ఆనందమోహనులను అధికారులు ఏర్పరచిరి. ఆ సమయమున వీరు స్వయముగ గాంచిన మహాత్ముని దినచర్య వీరి నెంతయో ఆకర్షించినది. మరియు భవిష్యత్తులో వీరికి ఆదర్శవంతమైనది.

గంగాయాం గీతా

కాశీ నివాసము ఒక సంవత్సరము పూర్తికాగా, విద్యాభ్యాసము ముగిసినందున ఆనందమోహనులు, హిందీ విద్యార్థినిగా ఆలహాబాదు వచ్చియుండిన వారి సోదరి, కాశీవిశ్వవిద్యాలయ మందు ఎమ్.ఎ.ఎల్.ఎల్.బి. చదువుచున్న ఆమె భర్తగారు (ఇలింద్ర రంగనాయకులుగారు) ఒక చోట కలిసికొని అచటనుండి హృషీకేశాది ఉత్తరభారత యాత్రను పూర్తిచేసికొనిరి. ఈ సందర్భములో ఆనందునకొక సమస్య ఎదురాయెను. తన విద్యాభ్యాసమింతటితో పూర్తియగును. స్నేహితులు, కొందరు బంధువులు ఇంకను ఆంగ్లమున ఉన్నతవిద్య నభ్యసించులాగున వీరిని ప్రోత్సహించదొడంగిరి. ఇక విద్యను చాలించి ఆశ్రమ జీవితమును గడుపుమని తల్లిదండ్రులనుచున్నారు. గురువుగారగు శ్రీసద్గురు మలయాళస్వాములవారున్ను అట్లే ఆదేశించుచున్నారు. తనకున్ను ఆశ్రమజీవితమందే ఇచ్ఛయున్నది. కాని దానికంత ప్రబలత చేకూరక అపుడపుడు ఉన్నతవిద్య వైపుకున్ను మనస్సు మొగ్గుచూపుచున్నది. 'ఇపుడు భావిజీవిత కర్తవ్యమేమి?' అని డోలాయమానసులగుచుండిరి. ఇట్లుండగా కాశీ వదలవలసిన సమయమాసన్నమాయెను.

సోదరి అలహాబాదు నుండి వచ్చి కాశీ చేరెను. సోదరి భర్తకు కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో ఎమ్.ఎ.ఎల్.ఎల్.బి. పూర్తియైనది. గాన అందరును కలసి హరిద్వారము చేరిరి. హరిద్వారంలో ఆనాడు వీరు మువ్వురూ కలసి గంగాస్నానమునకు వెళ్ళిరి. ఆనందమోహనుగారు తన స్నానాంతరము నదిలో కట్టడియున్న ఒక 'బోటు' లోనికిపోయి అందుకూర్చొని నదిని తిలకించుచుండిరి. ఇంతలో ఆ సమీపమున నదియందొక గడ్డికుప్ప కొట్టుకొని వచ్చుచుండుట వీరి కంటపడెను. వీరు వంగి వెంటనే దానిని చేతితో తీసి పడవలో వేయగా అందు ఒక నాగరలిపి భగవద్గీత కుంకుమ పుష్పపూజితమై కన్పించెను. వెంటనే ఆనందుడు ఆనందాతి రేకముతో ఒక గంతువేసి తమ సోదరిని, బావగారిని పిలిచి వారికద్దానిని చూపి ఒక తన భావిజీవితమును ఆశ్రమము నందే గడిపి "లోకమున కీ గీతాసేవచేయు" మని భగవదాదేశమైయున్నది. కావున యాత్ర అయినదే ఇంటికేగి అటనుండి ఆశ్రమము వెళ్లెదనని తీర్మానించి తమ కెదురైన సమస్యను పరిష్కరించిరి. మహాత్ములకు దైవమెట్లు తోడగునో చూడుడు. అటు పిమ్మట వారు హృషీకేశము, లక్నో, ఆగ్రా మొదలుగాగల ప్రదేశములను, క్షేత్రములను దర్శించి తిరిగివచ్చి ఇల్లు చేరిరి.

గురుకుల వాసము - తపస్సు

గురుదేవులు పూజ్యశ్రీశ్రీశ్రీ ఆనంగానందగిరి స్వాములవారు అనే శ్రీశ్రీశ్రీ సద్గురు మలయాళస్వాములవారి వద్ద 1936వ సంవత్సరం మే నెల 17వ తేది ఏకాదశి పవిత్ర దినంలో గురుకులవాసం చేయడానికి శ్రీ వ్యాసాశ్రమంలో (చిత్తూరు జిల్లా తిరుపతి శ్రీకాళహస్తి క్షేత్రముల మధ్య గలదు) ప్రవేశించారు.

ఇంత వరకు ఆనందమోహన్ గాయత్రి జపము, గురూపదిష్ట శివపంచాక్షరీ జపము చేసి తనకుగల మలదోషం నివృత్తం కాగా, ధ్యానసాధనలతో విక్షేపదోషం తొలగిపోగా, మిగిలిన ఆవరణదోష నివృత్తికై వీరికి శ్రీ సద్గురు స్వాములవారు మహావాక్యోపదేశాన్ని చేయ నిశ్చయించారు. శ్రీ ఆనందమోహను ఏకాంతప్రియుడు, సాధనాప్రియుడు. కాబట్టి శ్రీ సద్గురు స్వాములవారు వీరికి ఆశ్రమంలో దక్షిణవైపు చివరగల గుహాశ్రమాన్ని నివాసానికి ఏర్పాటు చేశారు. 18-4-1936 ద్వాదశినాడు శ్రీ సద్గురు స్వాములవారు ఆనందమోహన్‌ను స్వయంగా పిలిచి "ప్రజ్ఞానం బ్రహ్మ" "అహం బ్రహ్మాస్మి" "తత్త్వమసి" "అయమాత్మాబ్రహ్మ" అను మహావాక్యాలను ఉపదేశించారు. ఆ మహావాక్యోపదేశ మనన నిదిధ్యాసనలచే ఈ శిష్యరత్నంయొక్క ఆవరణ దోషం పటాపంచలైనది.

శ్రీ వ్యాసాశ్రమంలో సాధనకై వీరికి సద్గురు స్వాములవారు ఆశ్రమానికి దక్షిణంలో చివరగా ఏకాంతంగావున్న కుటీరాన్ని ఏర్పాటు చేశారని చదివాము గదా! శ్రీ వ్యాసాశ్రమం నందిపర్వతం చరియలో వుంది. చుట్టూ చిట్టడివి. ఆనందమోహన్ గారికిచ్చిన కుటీరం చుట్టూ దట్టమైన పొదలుగల అడవి. వేసవి రాత్రులందు కొండలలోని ఎలుగుబంట్లు ఆశ్రమం వద్దగల కొలనులో నీళ్ళు త్రాగడానికి వస్తూ పోతూండేవి. ఒకటి ఏకాంతంగా జనసంచారం లేక చివరలో వుండడం, చుట్టూ ముళ్లచెట్ల పొదలు కలిగివుండడం చేత ఆ కుటీరంలో మంచి వైరాగ్యంగల, భయంలని సాధువులుండి యుండిరి. ఇపుడు ఆనందమోహన్ నివాసం ఆ గుహాశ్రమమే.

శ్రీ ఆనందమోహన్ కాలేజి చదువు నుండే అపక్వాహారం తీసుకుంటున్నాడు. కాబట్టి ఇప్పుడు కూడ కొబ్బరిచిప్ప, నానవేసిన గుప్పెడు శనగలు గాని, పెసలు గాని, రెండరటిపండ్లు ఒక లోటా పాలు రోజుకు ఆహారంగా తీసుకొంటూ గురువుగారు ఉపదేశించిన మహావాక్యాలను మనన నిదిధ్యాసనలు చేస్తూ ధారణాధ్యానాలను తీవ్రంగా చేయసాగిరి. ప్రాతఃకాలం గురుసన్నిధిలో ఆశ్రమ సమిష్టి గీతాపారాయణలో ప్రతిరోజు భగవద్గీతను మొదట పారాయణ చేయడం, సాయంకాలం ప్రతిరోజు యోగవాసిష్ట రామాయణాన్ని చదివి అందరికి తెలుగులో అనువదించి చెప్పడం, తక్కిన సమయాలలో సాధన - ఇది ఆనందమోహన్ నిత్య కార్యక్రమం.

ఆనందమోహన్ పైన తెల్పిన ప్రకారం స్వామివారి సేవలో కొంతకాలం ప్రతిరోజు గడుపుతూ అపక్వాహారంతో

సాధనచేస్తూ శ్రీసనాతన సభలు వగైరా శ్రీ సద్గురు స్వాములవారి ప్రచార కార్యక్రమాల్లో ఉదయం సమిష్టిగీతాపారాయణలో తాను గీత చెప్తూ ఇతరుల చేత దానిని పలికిస్తూ ఇలా రెండు మూడు సంవత్సరాలు గడిచాక ఇంకనూ తీవ్ర సాధనలు చేయదలచి శ్రీ సద్గురు స్వాములవారి అనుమతి తీసుకొని ఒక సంవత్సరం పూర్తి కాష్టమౌనాన్ని పాటించారు. అప్పుడు సమిష్టిపారాయణ, సద్గురు ప్రచార కార్యక్రమాలు కూడా రద్దయ్యాయి. మౌనంతో పూర్తికాలాన్ని మనన నిదిధ్యాసనలు చేస్తూ యోవాసిష్ఠ రామాయణాను వాదాన్ని చేస్తూ పూర్తి ఏకాంతవాసం చేయసాగారు. వారి సాధనా సమయంలోని ఒక ఘట్టం మనం ఇచ్చట చర్చించుకోవడం సమంజసంగా వుంటుంది.

ఆశ్రమంలో కొంతమంది భక్తులు, సంవత్సరంలో నిర్ణీతమైన ఒక్కొక్కరోజు ఒకరొకరు శ్రీ సద్గురు స్వాములవారికి పాదపూజ, ఆశ్రమస్థులందరికి భిక్ష (మృష్టాన్న భోజనం) చేయడం పరిపాటి. అలా ప్రతి సంవత్సరం భిక్ష చేసేవార్లలో ఏకొల్లు (నెల్లూరు జిల్లా, నాయుడుపేట సమీపం) గ్రామస్థులు ఒక రెడ్డిగారు ఒకరు. వీరికి శ్రీసద్గురు స్వాములవారి యందెంత భక్తో, శ్రీ ఆనందమోహన్ స్వామియందును అంత భక్తిశ్రద్ధలు. అంచేత ప్రతి సంవత్సరం వారి బిక్షరోజున పాయసం, వడలను తీసుకు వచ్చి ఆనందస్వాములకిచ్చి 'మాకోసం ఈ ఒక్కరోజు దీన్ని తప్పక తినండి స్వామి' అని వినయంతో ప్రార్థించి పెట్టిపోయేవారు. దాన్ని స్వామివారు ప్రతి సాయంకాలం తమవద్దకు పోయే మావంటి విద్యార్థులకో, లేక ప్రక్కన అడవిలో పశువులను, మేకలను మేపుకొనిపోవువారికో పెట్టేసేవారు.

కాని ఒక రోజు ఆనందస్వామిని మాయ ఒక వూపు వూపి చూసింది. ఆ రోజు భక్తుడు చెప్పినట్లు ఆ భక్ష్యాలు ఒకరోజు తినిన దానివలన ఏం నష్టం జరుగుతుంది? తినేద్దాములే అని చేతికి తీసుకొని తినబోయారు. అంతలోనే బుద్ధి 'ఏమయ్యా! ఇంతకాలం ఆపక్వాహార నియమాన్ని పాటించి ఆఖరుకు ఈ ఒక్క క్షణంలో అంతా బూడిదలో పోసిన పన్నీరు చేస్తావా? నియమభంగం చేస్తావా? రసనేంద్రియానికి నీవు దాసుడవవుతావా?' అని హెచ్చరించింది. వెంటనే స్వామి తేరుకొని నిజమేగదా నే నీ పనిచేస్తే రసనేంద్రియానికి, జిహ్వాకు లోబడినట్లే గదా! అని ఆ ఫలహారాన్ని అక్కడే ఉంచేసి తన వ్రాతలోసాధనలో తాను మునిగిపోయారు. ఆ ఫలమార విషయమే మరచిపోయారు. నాల్గురోజులకు వాసన ప్రారంభమైంది రూములో. ఏమిటా అని పరిశీలిస్తే ఈ క్షీరాన్నం పాచిపోయి వాసన రాసాగింది. అరే! దీని నిజస్వరూపం ఇంతేగదా! ఇట్టి వస్తువును తినాలనా నేను నియమోల్లంఘన చేయబోయాను' అని ఆ పదార్థాన్ని దాని స్వరూపాన్ని, అనిత్యతను, అపాతరమణీయత్వాన్ని మాటిమాటికి చింతన చేశారు. మరల ఎన్నడూ అట్టి ఆలోచనలు రానేరాలేదు.

ఆశ్రమములో శ్రీసద్గురు మలయాళస్వాములవారిని పెద్ద స్వాములనియు, వీరిని చిన్నస్వామి యనియు, ఆనందస్వామి యనియు అందరు అనుచుండిరి. ఆశ్రమ దర్శనమున కేతెంచిన ప్రతిభక్తుడు శ్రీ సద్గురుస్వాములవారి దర్శనానంతరం ఈ చిన్నస్వామిని దర్శించుట అలవాటై పోయినది. దర్శనార్థులను వీరు ప్రసన్న వదనముతో వీక్షించి, చిరునగవుతో వారితో ఏ ఒకటి రెండు మాటలాడి వెంటనే పంపివైతురు. సమయమును ఏమాత్రము వ్యర్థపుచ్చరు. వారి నివాసమందు "ఆయుషః క్షణేకోపి సర్వరత్నైర్న లభ్యతే, నీయతే తద్వృథా యేన ప్రమాదః సుమహానహో" అని పెద్దబోర్డు నల్లటి అక్షరములతో వ్రాసిపెట్టుకొని యుండిరి. అనగా ఆయుస్సును వ్యర్థము చేయరాదని భావము. వీరు చూచుట కెంత గంభీరముగ గోచరింతురో అంత సరళహృదయులు. కావుననే నీటబడిన చిన్నపురుగును గూడ చూచి సహించి యుండలేరు. బాధతోనున్న వానిని చూచినను సహించలేరు. తాము ఆపక్వాహారులు గాన తమకు భక్తులు దర్శనమునకు వచ్చునపుడు తెచ్చియిచ్చు మంచి మంచి ఫలహారములను ప్రక్కన అడవికిపోవు పశువుల కాపరులను పిలిచి ఇచ్చివేయుచుండిరి. కావన ఆ పరిసర పశువుల కాపరులకు ఆనందస్వామి యనిని గొప్ప అభిమానము. పెద్ద, చిన్నపాములధికముగా చుట్టూ తిరిగిచుండెడివి. అపుడపుడు

గదిలోనికి కూడా అవి వచ్చుచుండెడివి.

ఈ సందర్భములో ఒక సంఘటన జ్ఞాపకమునకు వచ్చినది. దాని నిట నుటంకింతును. రోజూ స్వామీజీ రూముముందు పందిరి క్రింద అరుగుపై శయనింతురు. అట్లే రాత్రి శయనించియుండ నొక రోజు స్వామీజికి నిద్రయందు "తమ శిరస్సునకు నేరుగా పై పందిరిపై ఒక సర్పము ఉన్నట్లు" ఒక దృశ్యము గోచరించినది. వెంటనే శ్రీవారికి మెలకువ వచ్చి పైకి లేచి ప్రక్కనున్న బ్యాటరీ తీసి పైన పందిరిపై వేయుదమను కొన్నంతలో ఆ పాముపై నుండి సరిగా శ్రీవారు పండుకొని యున్నప్పుడు శిరస్సుండిన చోటనే దభాలుమని పడినది. ఏమిటి శబ్దమని శ్రీవారు బ్యాటరీ వేయగా పాము. ఆ పైన అట నుండి అద చరచరా కదలి పారిపోయినది. చూచితిరా దైవలీల! "యోగక్షేమం వహామ్యహం" అన్న భగవత్ప్రతిజ్ఞకిది యొక నిదర్శనము గదా! శ్రీవారికి నిద్రలో నీ దృశ్యము గోచరించినదో అది నిజమేయైనది. అత్తటివారు నిద్రనుండి లేవకుండిన, పాము శ్రీవారి శిరముపై పడియుండెడిది గదా! కాన దైవము ఆ ఘట్టమున ఎట్లు రక్షించెనో చూడుడు. దైవముపై భారము వేసిన మన భారము నా దేవదేవుడే వహించును. "న మే భక్తః ప్రణశ్యతి" అని భగవానుని అభయవాణి గదా!

పాములు కీడు చేయునవైనను వానని చంపుటకు స్వాములవారు ఇష్టపడరు. కావున ఆ పాములకై ఒకరకమైన బోనును వీరు తయారు చేయించిరి. రూములోని కేతెంచు పాములు యధేచ్ఛగా పోయిన సరి. లేకున్న వానిని పెద్ద పొడుగాటి పట్టుకర్రతో పట్టి బోనులో వదలి వానిని కొండలో దూరముగా వెళ్లి వదలిపెట్టి రావలెను. ఇది వీరి నియమము. చూచితిరా ఎంత కరుణార్ద్రహృదయమో వీరిది. కరుణలో వీరికి బుద్ధుడు ఆదర్శమూర్తి, బుద్ధుడనినను, బౌద్ధమతమనినను వీరికి గొప్ప ఆదరము, గౌరవమున్ను గలదు. కావుననే వీరు వ్యాసాశ్రమ తాపస జీవితసమయమున "ధర్మపథము" అను బుద్ధగీతను తెనిగించిరి. అట్లే కఠోపనిషత్తు, యోగవాసిష్ఠము, వివేకచూడామణియు వీరికి అతి ఇష్టములు. యోగవాసిష్ఠ మహాగ్రంథమును ఆ సమయమున సంస్కృత భాష నుండి వీరు తెనిగించిరి. వీరు అనువదించిన యోగవాసిష్ఠము ధర్మపథములను గ్రంథములను శ్రీ వ్యాసాశ్రమమువారు ప్రచురించియున్నారు. ఈ ఆనంద స్వామిని బాల్యమునందే హృదయము నాకర్షించిన లక్ష్యమూర్తి శ్రీ వివేకానందస్వామి. కనుక వీరి హృదయమెల్లప్పుడు ఉత్సాహముతో, ధీరత్వముతో నిండియుండును. వివేకానందుని "బీ ఫియర్‌లెస్" అను వాక్యము వీరికి ఇష్టమంత్రము. కాన వీరి గుహాశ్రమ కుడ్యములందు (గోడలపై) ఈ మంత్రమే దేదీప్యమానముగ గోచరించెడిది. వీరి తాపసిక జీవితమందు ఒక సంవత్సరము పూర్ణ మౌనముతో, తీవ్రసాధనలతో గడిచినది. ఆ సందర్భములో సమాధిమగ్నులైన వీరు ఆకలిదప్పులు లేనివారై రోజులో ఎప్పుడో ఒక మారు కొద్ది అపక్వాహారమును మాత్రము స్వీకరించిన సందర్భములు గలవు. తీవ్రసాధనలచేతను, అతి స్వల్ప ఆహారము చేతను వీరి శరీరము చాల కృశించిపో సాగినది. అపుడు వీరు పెద్దల సలహా మేరకు చాల ప్రోద్బలముపై రోజుకు రెండు చిట్లపాలను తీసికొనుట కంగీకరించిరి. వీరి సాధనలలోని ఘట్టములను వ్రాయవలెనన్న అదొక బృహద్గ్రంథ మగును. వారి 'సాధనడైరీ'ని చూచినచో మనోజయమునకు, ఇంద్రియద మనమునకు వారు చేసిన సాధనలు, వాని ఫలితములు అద్భుతములుగా నుండగలవు. 1942 సంవత్సరము నుండి వీరు తమ ఏకాంత కుటీరమును వీడి బయటకు రాక (సకృత్తుగా శ్రీ సద్గురు సన్నిధికి మినహా) చాలా తీవ్రముగా సాధనచేయుచు తమ దర్శనార్థులతో ముక్తసరిగా మూడు మాటలాడి పంపుచు తమ సాధనను తీవ్రముగా చేసిరి. వీరు చాల వైరాగ్య పురుషులు. ఆంగ్ల పట్టభద్రులయ్యు ప్రాచీన పద్ధతిన కట్టుబాట్లు గల్గి చాల వైరాగ్యజీవితమును గడుపుచుండిరి. ''యోగన్య ప్రథమం ద్వారా వాఙ్నిరోధో2పరిగ్రహః" అనునట్లును, "జిహ్వోపస్థ పరిత్యాగే కో న ముచ్యేత బంధనాత్'' అనునట్లును వీరు స్వల్ప అపక్వాహారమును గ్రహించుచు మౌనముతోను, లేక మితభాషణముతోను గూడి జనసంగము లేక ఏకాంతముగా వసించుచు జితేంద్రియులై "వివిక్తసేవీ లాఘ్వాశీ యతవాక్కా

యమానసః ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః "అను గీతావాక్యరీతి శ్రీవ్యాసాశ్రమమున గురుసన్నిధి యందు ద్వాదశవర్షములు (పంద్రెండేండ్లు) ధ్యాననిష్ఠయందుండి శ్రవణమనన నిదిధ్యాసనములచే బ్రహ్మాకార వృత్తినంది ఆపైన వృత్తిరహితులై సమాధ్యనుభవముచే ఆనందముగ నుండిరి. అపుడు వీరి గురుదేవులు ఈ ఉత్తమ ఆదర్శ శిష్యునకు తమ చేతులార ప్రథమంగా సన్న్యాస మివ్వదలంచిరి. ఆనంద మోహనులున్ను ఎప్పుడెపుడు గురుదేవుడు సన్న్యాస మిచ్చునాయని కాచుకొని యుండుటచే అమితానందముతో ఉప్పొంగిపోయెను. అయితే సన్న్యాస గ్రహీత "కఠోపనిషత్తు, పతంజలి యోగశాస్త్రము, భగవద్గీత అను ఈ మూడింటిని కంఠస్థము చేసియుండవలెను'' అను శ్రీ వ్యాసాశ్రమ నియమము వీరిపట్ల చర్చకే రాలేదు. ఏలయనిన వీరి కవి చిన్ననాటనే కంఠస్థములై యుండెను.

సన్న్యాస (తురీయాశ్రమ) స్వీకారం

అంతట నిశ్చయింపబడిన ముహూర్త ప్రకారము 29-6-1974 నుండి 3-7-1947 వరకు (సర్వజిన్నామ సంవత్సర ఆషాఢ శుద్ధ ఏకాదశి ఆదివారం నుండి పౌర్ణమి గురువారం పర్యంతము) పంచాహ్నిక విధానమున శ్రీవారి సన్న్యాసస్వీకారము జరిగెను. ఈ ఉత్సవమునకు దేశము నలుమూలల నుండి రెండు వేలమంది ప్రేక్షకులు, భక్తులు వచ్చియుండిరి. ఆ యుత్సవము కన్నులపండువుగా బ్రహ్మానందముగా నుండెను. సన్న్యాస స్వీకరణోత్సవ మింత శాస్త్రీయముగా, ఇంత ఆనందముగా గొప్పగా ఎప్పుడును జరిగియుండలేదని భక్తులనుకొనిరి.

ఇచట ఒక విషయము మనము మరువరానిది. గత చరిత్రను మనము పరికించినచో గురు సంప్రదాయమును, ముఖ్య పరంపరను గుర్తించుటకై కొన్ని సంఘటనలు జరిగియున్నట్లు తెలియచున్నది. అటులనే మన స్వామీజీ గురుదేవులగు శ్రీ అసంగానందగిరి స్వాములవారికి (శ్రీ మలయాళ స్వాములవారికి) వారి సన్న్యాస సందర్భమున వారికి సన్న్యాసము నొసంగిన శ్రీ శంకరానంద స్వాములవారు తమ హస్తములతో తయారుచేసిన కమండలము నొసంగిరి. దానిని శ్రీ మహర్షి మలయాళస్వాములవారు తమ ఈ శిష్యునకు సన్న్యాస మొసంగిన సందర్భములో ఆ కమండలువు చరిత్రను చెప్పి 'మా గురువుగార్చిన దీనిని మీకు ఇచ్చుచున్నా'మని చెప్పి ఇచ్చిరి. ఇయ్యది సత్పాత్రదానమే. (ఇది పరంపరకు ముఖ్య చిహ్నముగ నేటికిని జాగ్రత్తపరచబడి యున్నది)

శ్రీ శుకబ్రహ్మాశ్రమస్థాపన

శ్రీ స్వాములవారు (శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాములవారు) కొంతకాలం శ్రీ వ్యాసాశ్రమంలోనే వుండి ఆ తరువాత తాము వేరుగా ఒక ఆశ్రమాన్ని స్థాపించాలను కొన్నారు. దానికి తగు స్థలం కోసరం వేచియున్నారు. ఇంతలో శ్రీస్వాములవారి తొడపై ఒక కురుపు లేచింది. దానికి ఆకులు అలుమలు కట్టారు. అది పెద్దదై ఆఖరుకు శ్రీకాళహస్తి ఆస్పత్రికి పోవలసి వచ్చింది. అలా చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తికి వచ్చిన శ్రీస్వాములవారు శ్రీ పి.వి. రామచంద్రరావుగారి తోటలోని ఆశ్రమంలో విడిది చేసిరి. ప్రతిరోజు గవర్నమెంటు ఆస్పత్రి డాక్టరుగారు విచ్చ కట్టుకట్టి డ్రస్సింగ్ చేసిపోతూండిరి. అలా వుంగా ఒకరోజు రాత్రి పెద్ద వర్షం వచ్చింది. ఉదయం శ్రీ స్వాములవారు తోటలలోనికి పోగా ఎచటనూ కాలికి చెమ్మ, బురద అంటలేదు. ఇసుకనేల గదా! గుంటూరు ఆశ్రమంలో వర్షంపడితే అడుగుపెట్టితే బురద, ఇచటకు అచ్చుటకు తేడా కనిపించింది. వెంటనే శ్రీస్వామిగారి మనస్సులో ఈ శ్రీకాళహస్తిలో ఆశ్రమాన్ని నిర్మించాలనే బలమైన సంకల్పం కలిగింది. ఆ సంకల్ప బలంచే శ్రీ వ్యాసాశ్రమానికి సమీపంలోగల దక్షిణ కాశియగు శ్రీకాళహస్తిలో పావన సువర్ణముఖీ నదీతీరంలో శ్రీ శుకబ్రహ్మాశ్రమం అనుపేర ఆశ్రమస్థాపన చేసిరి. ఈ ఆశ్రమ ప్రారంభోత్సవం 1950వ సంవత్సరం జనవరి నెల 20వ తేది, విరోధినామ సంవత్సర మాఘశుద్ధ విదియ రోజున ప్రాతఃకాలం 4.30 గంటలకు శ్రీవారి గురుదేవులగు శ్రీశ్రీశ్రీ సద్గురు మహర్షి మలయాళ స్వాములవారి అమృత హస్తములచే గావింపబడినది. ఆ

తరువాత ఆశ్రమము భక్తుల సహకారముచే పూజామందిరము, భోజనశాల, అతిథి మందిరము, బీదలకు ఉచిత వైద్యాలయము మొదలైనవి గల్గి సకల సౌకర్యములతో గూడి బ్రహ్మాండముగా అభివృద్ధి నొందుచు సదా భక్త జనులతో కళకళలాడుచున్నది. దాని మౌక్తికోత్సవము 1962 సంవత్సరము మార్చి నెలలో అతివైభవముగా జరిగిన విషయము సర్వులు ఎఱిగినదే. మరియు శ్రీ మహర్షి మలయాళస్వాముల వారు తాము స్థాపించి ప్రతి సంవత్సరము నడుపుచున్నట్టి శ్రీ సనాత వేదాంతజ్ఞాన మహాసభకు అధ్యక్షులుగా శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిని 1955 సంవత్సరములో నియమించిరి. తదాదిగ 1994 వరకు వారే ఆ మహాసభకు అధ్యక్షులుగా ఉంటూ ఆ కార్యక్రమమును జయప్రదముగా నడిపిరి.

శ్రీవారి ప్రవచనములు

శ్రీ స్వాములవారి ప్రవచనాలు చాల తేలిక భాషలో మృదుమధురముగ శ్రవణానందముగ నుండును. వీరి ఉపన్యాసములకు వేలకొలది జనులు వచ్చి నిశ్శబ్దముగా శ్రవణము చేసెదరు. వీరికి దేశము నలుమూలలనుండి ఆహ్వానములు అనేకముగ వచ్చుచుండెను. అచటచట గీతా యజ్ఞములను జరుపుచు ఆయా ప్రదేశములందు 18 దినములు రోజుకొక అధ్యాయము చొప్పున గీతను విపులముగ బోధించుచు, అనుష్ఠాన పద్ధతులను వివరించుచు శ్రీవారు అమోఘముగ గీతా ప్రచారమును గావించుచున్నారు. వీరు ఉపన్యసించిన ప్రదేశములలో బొంబాయి, షోలాపూర్, బెంగుళూరు, మైసూరు, కోలారు, కొళ్ళేగాల్, ఖర్గపూర్, మద్రాసు, బళ్ళారి, చిత్తూరు, ప్రొద్దుటూరు, నెల్లూరు, విజయవాడ, తెనాలి, గుంటూరు, నరసారావుపట, బందరు, ఏలూరు, కాకినాడ, విజయనగరం, విశాఖపట్నం, హైదరాబాదు మొదలగు నగరాలు గలవు. వీరు తెనాలిలో ఇచ్చిన ఉపన్యాసములను గూర్చి ఆంధ్రప్రభ ఇలా ప్రకటించినది. "శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు తమ సరళమైన భాషలో బహుజనాకర్షణీయంగా గీతోపన్యాసములు చేస్తున్నారు. ప్రతిదినం అశేష ప్రజానీకం హాజరవుతున్నారు"

ఇట్లు శ్రీవారు 108 గీతాజ్ఞాన యజ్ఞములు 58 గీతా సదస్సుల ద్వారా తమ ప్రవచనములచే దేశములోని ప్రజలకు ఆధ్యాత్మిక విజ్ఞానము నొసంగియున్నారు. వీరు వాసిష్ఠ రామాయణమును అనగా యోగ వాసిష్ఠమును సంక్షేపించి "వసిష్ఠ గీత" యని వ్రాసి ప్రచురించిరి. అదే నేడు యోగవాసిష్ఠ రత్నాకరము అనే పేరుతో గలదు. వీరి గీతోపన్యాసములు గ్రంథరూపమున వెలువడినవి మరియు వీరు "గీతా మకరందము" అను పేరుతో గీతకు 1100 పేజీలుగల గొప్ప వ్యాఖ్యను వ్రాసిరి. అదియు నిపుడు ప్రచురితమై జనులలో విరివిగ ప్రచారమగుచున్నది. ఈ గీతామకరందము విశిష్ట వ్యాఖ్య. అంచేత ఆంగ్లం, తమిళం, కన్నడం, హిందీ భాషలలో అనువదింపబడినది. ఇంకను మోక్ష సాధన రహస్యము, భారత రత్నాకరము, భాగవత రత్నాకరం, రమాయణ, రత్నాకరం, ఉపనిషద్రత్నాకరం అను పంచ రత్నాకరాలను, తత్త్వసారము మొదలైన గ్రంథములను సులభమైన భాషలో వ్రాసి ప్రకటించిరి. అంతేగాక భక్తుల కోర్కెపై "వేదాంతభేరి" అను ఆధ్యాత్మిక మాసపత్రికను 1963 సంవత్సరం నుండి ప్రారంభించి విజయవంతముగ నడుపుచున్నారు. శ్రీకాళహస్తిలో శ్రీవారి భూరివిరాళము లిచ్చి ఒక కళాశాలను స్థాపింపచేసిరి. అదే "స్వామి శ్రీ విద్యాప్రకాశానంద గవర్నమెంట్ ఆర్ట్సు అండ్ సైన్స్ కాలేజి" అను పేరుతో శ్రీకాళహస్తిలో చక్కగా నడచుచున్నది. మరియు మరికొంత విరాళమిచ్చి "శ్రీ విద్యాప్రకాశనంద స్వామి జూనియర్ మహిళా కళాశాల"ను కూడా శ్రీకాళహస్తిలో ప్రారంభింపచేసిరి.

త్రినేత్ర వైద్యాలయము

శ్రీ స్వాములవారు కంటి యొక్క ఉపయోగం ఎంత విలువైనదో గుర్తించారు. "సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్" అన్నట్లు కన్ను వుంటే అన్నీ వున్నట్లే. లోకంలో

కంటిపొరలతో కండ్లు వుండీ లేనివారై వృద్ధులెందరో బాధపడుతూండడం శ్రీస్వాములవారిని కలచివేసింది. కాబట్టి నిరుపేదలకు, శ్రామికులకు నేత్రదానం చేయాలని సంకల్పించారు. ఆ సంకల్ప రూపమే శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో స్థాపించిన "భక్త కన్నప్ప త్రినేత్ర వైద్యాలయము" 1991 మే 5 తేది త్రినేత్ర వైద్యాలయానికి భూమిపూజ జరిగింది. అనతి కాలంలోనే ఆస్పత్రికి 16 పడకలు, రెండు ఆపరేషన్ థియేటర్లుగల మంచి భవనం యేర్పడింది. 1994 సంవత్సరంలో ఒక శుభముహూర్తంలో ఆశ్రమంలో ఈ కంటి ఆస్పత్రి ప్రారంభింపబడి ఇప్పటికీ కొన్ని వేలమందికి కంఇ ఆపరేషన్లు చేయబడి చూపు తెప్పించబడింది. ఆస్పత్రికి అనేక ప్రాంతాల నుండి రోగులువచ్చి ఉచిత చికిత్స చేసుకుపోతున్నారు.

భగవద్గీత ఆడియో, వీడియో కేసెట్లు

శ్రీ స్వాములవారి గీతోపన్యాసాలకు వేలకు వేల జనం రావడం చూచి తిరుమల-తిరుపతి దేవస్థానం వారు 99వ గీతాయజ్ఞం నుండి 108వ గీతాజ్ఞానయజ్ఞం వరకు అన్ని జ్ఞానయజ్ఞాలను దేవస్థానం వారే ఖర్చుపెట్టి నిర్వహించడమే గాక 1981 సంవత్సరంలో శ్రీ స్వాములవారి గీతోపన్యాసాలను రికార్డుచేసి ఆడియో కేసెట్లను విడుదల చేశారు. టి.టి.డి. వారి ఈ సేవ వలన వేలకు వేలు ఆడియో కేసెట్లను ప్రజలు కొని ఆనందిస్తున్నారు. అట్లే టి.టి.డి. దేవస్థానంవారు శ్రీ స్వాములవారి ప్రవచనాలను హైద్రాబాద్ నిజాం కాలేజిలో ఏర్పాటుచేసి వీడియో కేసెట్లను కూడా రికార్డుచేసి విడుదలచేశారు. ఇవి కూడ బహుజనాదరణను పొందాయి. ఆంధ్రదేశం నలుమూలలా వీటి ద్వారా శ్రీ స్వాములవారి సందేశం వ్యాపించింది. శ్రీవారు లోకోత్తర పురుషులై తాము తరించుటేగాక ఇతరులను కూడ తరింపజేసి యున్నారు.

మహాసమాధి

మహాత్ములు ఎందుకోసం అవతరించారో ఆ పని అయిపోయిన వెంటనే తమ అవతారాన్ని చాలిస్తారు. అట్లే పూజ్యశ్రీ శ్రీశ్రీ స్వాములవారు ఆంధ్రదేశంలో పండితులు మొదలు పామరులు వరకు గీతాజ్ఞానాన్ని పంచిపెట్టే కోసరం అవతరించారు. ఆ విధంగానే అందరికి గీతాజ్ఞానాన్ని అందించారు. ఇక వారు వచ్చిన పని అయిపోయింది. కాబట్టి 84 సంవత్సరాల వయస్సులో 1998 ఏప్రిల్ 10వ తేది చైత్ర శుద్ధ చతుర్దశినాడు ఈ పార్థివ శరీరాన్ని వదలి మహాసమాధిని పొందారు. శ్రీవారి సమాధి విషయం రేడియో, టి.వి., దినపత్రికల ద్వారా దేశమంతా ప్రాకింది. దేశపు అన్ని ప్రాంతాల నుండి వేలకువేలు జనం వచ్చి శ్రీవారి భౌతిక శరీరాన్ని కడసారి దర్శించి తమ తమ శ్రద్ధాంజలులు ఘటించారు. ఏప్రిల్ 12 తేది శ్రీ స్వాములవారి భౌతిక కాయం ఆశ్రమంలో సమాధి చేయబడింది. శ్రీవారి ఈ సమాధిపై ఇరవై లక్షల రూపాయలు వెచ్చించి ధ్యానమందిరం నిర్మింపబడింది. ఇట్టి ఆదర్శ పవిత్ర మహాత్ములను మనము ముందుంచుకొని వారి బోధనలను ఆచరణలో బెట్టి మనమున్ను శాంతి నొందెదముగాక!

మంగళం వేదవేద్యాయ గీతాజ్ఞాన స్వరూపిణే
విద్యాప్రకాశరూపాయ గురుదేవాయ మంగళమ్...

ఓమ్ తత్ సత్



గీతా పాఠశాల



కంటి వైద్యం

మోక్షప్రాప్తికై ఉపదేశ చతుష్టయము

- పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

మోక్షప్రాప్తికై వేదశాస్త్రాదులందు మహర్షులు కావించిన సద్బోధనంతను నాలుగు చక్కని వాక్యములలో ఇమిడ్చి చెప్పవచ్చును. ఆ మహోన్నత ఆదేశములనే ఇంగ్లీషుభాషలో F[4] అని అందరు. అవి యేవి యనిన -

Follow the master
Face the devil
Fight to the end
Finish the game

వీని యర్థము -

సద్గురువును ఆశ్రయింపుము
మాయను ఎదుర్కొనుము
చివరివరకు పోరాడుము
జగన్నాటకమును అంత మొనర్చుకొనుము

తరింపనెంచు పరమార్థ సాధకునకు ఈ నాలుగు ఆదేశములు చాలును. వీనిని జ్ఞాప్తియందుంచుకొని, తదనురీతిగ అనుష్ఠించినచో అతడు గట్టెక్కిపోగలడు. లేనిచో ఈ దుర్భర సంసార దావానలనమున తగుల్కొని ఇంకెంతయో కాలము దుఃఖజాల మనుభవింపవలసి యుండును.

1. సద్గురువు నాశ్రయింపుము

'సద్గురువును ఆశ్రయింపుము' అనునది వీనిలో మొదటి ఆదేశము. కోట్లకొలది జన్మలు ఈ సంసారఘటీ యంత్రమున తిరుగాడి పుట్టుచు, చచ్చుచు ఏదియో సుకృత వశమున ఒకింత వివేకము జనింప మనుజుడు" ఇది యేమి విచిత్రము! ఈ శరీరమేమి? ఈ సృష్టియేమి? ఈ పుట్టుట యేమి? ఈ చచ్చుటయేమి? ఈ ప్రకారము కలకాలము జరుగవలసినదేనా? ఈ దుస్సహ యాతనాపరంపరను నిలుపుదలచేయుటకేదైన ఉపాయము కలదా?'' అని ఆలోచింపదొడంగును. దీనినే 'శుభేచ్ఛ' యందురు. ఇది సప్తజ్ఞాన భూమికలలో మొదటిది. బహుజన్మ పుణ్యవిశేషము చేతనే ఇట్టి వివేకము జనులయందుదయించును.

ఈ ప్రకారముగ వివేకోదయము కలిగినపుడు అతడు చేయవలసిన మొట్టమొదటి పని సద్గురువును వెతకుకొనుట. 'ప్రేక్షే2హం శాస్త్రసజ్జనైః' అనునట్లు వైరాగ్యోదయ కాలమున మనుజుడు తనకు దారి చూపువారెవరా యని పరితపించుచు, 'మహాత్ములను సందర్శించి నా యభీష్టమును వారికి తెలిపి అంధకారమున ఒకింత వెలుగును సంపాదించుకొందును' అని నిశ్చయించుకొనును. మఱియు శాస్త్రములందు, సద్గ్రంథములందు ఆసక్తి కలిగి వానిని పరిశీలించు చుండను. జీవితములో ఇదియొక గొప్ప పరిణామము (టర్నింగ్ పాయింట్). ఇక్కడ నుండియే వాని జీవితము ఒక మలుపు తిరుగును. ఇంత వరకు గడిపిన కోటాను కోట్ల సంవత్సరముల అసుర జీవితము ఒక రకము. ఇక ఇపుడు గడుపనున్న దివ్య జీవితము మఱియొక రకము. ఈ రెండింటికి పొత్తు ఉండదు. ఏ ప్రాపంచిక సంపదలను నమ్ముకొని ఇంత వరకు అతడు తన జీవితము గడపెనో, ఏ విషయ భోగములే సర్వస్వమని భావించి, అవియే తన యేడుగడ యని నమ్మియుండెనో, ఏ విషయానందనమును జూచి 'ఇంతకు మించిన సౌఖ్యము మఱియొకటి ముల్లోకములందును లేద'ని భావించెనో, అట్టి ఇంద్రియ సుఖములే వైరాగ్యోగయ కాలమున వెలవెలబోవ, నీరసింప, వానిపై విరక్తి జనించును. విషయ సుఖములే అహర్నిశము అనుభవించుచు పోయిన ఇక పశువులకును తనకును భేదమేమి? యను వితరకమపుడు వానియందుదయించును.

అత్తఱి జీవితనౌకను అతడు నూతన మార్గమునకు మళ్లించుకొనును. దక్షినాయణమున నున్నవాడు ఉత్తరాయణమునకు మఱలును. అసుర సంపదలో మునిగియున్నవాడు క్రమముగ దైవసంపదను చేకూర్చుకొనదొడగును. అట్టి శుభలగ్నముననే మనుజుడు గుర్వన్వేషణ ప్రారంభించును. పుణ్యము ఫలించినపుడు సాధన

మాత్రమే జీవునకు సద్గురువు లభించును. సద్గురువు గాని, సచ్ఛాస్త్రముగాని, సద్బోధగాని ఎవరికైన లభించినచో అది బహుజన్మపుణ్యఫలమని, భగవత్కృపాకటాక్ష లబ్ధమని నిశ్చయించుకొనవలెను.

గురువు లభించిన మీదట వారు కావించు ఆదేశమును శిరసావహించి తదను రీతిగ అనుష్ఠించుటకై ముముక్షువు తీవ్రతర యత్నము కావింపవలెను. శ్రద్ధాభక్తులతో, పరిపూర్ణ విశ్వాసముతో గురువాక్యమును, శాస్త్రవాక్యమును పరిపాలించవలెను. "ఫాలో ది మాస్టర్" సద్గురువును ఆశ్రయించుము, అనుసరించుము అను ప్రథమోపదేశము యొక్క అర్థమిదియే.

ఆధ్యాత్మవిద్య అనుభవైకవేద్యమగు శాస్త్రము (ప్రాక్టికల్ సైన్సు) అయియున్నది. ఒక చిన్న ఉపదేశమును జిజ్ఞాసువు కొన్ని సంవత్సరముల పర్యంతము సాధన చేయవలసి యుండును. మార్గమధ్యమున అనేక సంశయము లుదయించుటచేతను, అనేక వితర్కములు జనించుటచేతను ఈ విద్యను సాధింపదలచువాడు అనుభవజ్ఞుడైన వ్యక్తినే ఆశ్రయించుట సముచితము. మహర్షులందఱును అట్టి అనుభవజ్ఞులైన సద్గురువులే. కనుకనే వారు బోధించిన, రచించిన శాస్త్రములన్నియు సాధకునకు పరమప్రమాణములై యొప్పుచున్నవి. గురోర్గురువై, జగద్గురువైనట్టి శ్రీకృష్ణపరమాత్మ బోధించిన గీతాశాస్త్రము, అట్లే వ్యాసమహర్షి, శంకరాచార్యులు మున్నగు మహనీయులు కావించిన సద్బోధలు ముముక్షువులకు అత్యంత శిరోధార్యములై, అనుసరణీయములై యున్నవి. ఈ ప్రకారము పూర్వకాలిక గురుసత్తములపైనను, వారు బోధించిన సచ్ఛాస్త్రములపైనను అకుంఠిత విశ్వాసము గలిగి సాధకుడు వానిని అనుసరించుచు జీవితమును ఆధ్యాత్మికముగ పరిణత మొనర్చుకొనవలెను. గురుసేవ, గురువాక్యానుసరణము ఈ రెండును సాధకునకు అత్యావశ్యములని ఎన్నటికిని మఱువరాదు.

తాను గొప్పవాడననియు, సమస్తము తనకు తెలియుననియు తలంచి శిష్యుడు ఏ కాలమందును అహంకరించరాదు. గురువుయొద్ద తన తల వంగినపుడే ప్రపంచమంతయు తన యొద్ద తలవంచును. ఈ సూత్రమును జ్ఞప్తియందుంచుకొని ముముక్షువు భవంతుని యెడల, సద్గురువుల యెడల, పెద్దల యెడల వినయవిధేయతలు గలిగి, వారి వాక్యములను అకుంఠిత శ్రద్ధతో పరిశీలించుచు, జీవితమునందు గొప్ప పరిణామమును సాధించవలెను. మోక్షప్రాప్తి కిదియె ఏకైకమార్గము. ఈ ప్రకారముగ సద్గురు సమార్శ్రయణము మానవుని బంధ విముక్తికి అత్యావశక్యకమై యున్నది.

ప్రపంచములో గురువులు దొఱకవచ్చునుగాని సద్గురువులు దొఱకుట చాల దుర్లభము. శిష్యులను సద్వస్తువగు ఆత్మ యొద్దకు చేర్చువాడే సద్గురువు. సచ్ఛీలమును వాక్కునందేగాక అనుష్ఠానము నందును దిగ్దర్శన మొనర్చువాడే సద్గురువు. శిష్యుల అజ్ఞానాంధకారమును రూపుమాపి జ్ఞానాలోకమును వారికి ప్రసాదించువాడే సద్గురువు. కావున అట్టి యోగ్యతలు గలవారు సహజముగనే జనులలో చాల అరుదుగా నుందురు. భగవానుడు ఎన్నుకొనిన ఏ కొలదిమంది మహనీయులో అట్టి సద్గురు పీఠ మలంకరించి లోకములో విరాజిల్లుచుందురు.

అట్టి మహనీయుల జీవితము వాస్తవముగ ప్రజలకు వసంత సదృశములుగనే యుండును. ఆధ్యాత్మిక విషయములందు పండిన యనుభవముగల మహనీయు లగుట వలనను, పారమార్థిక సూత్రములన్నియు వారికి కాచి వడబోసినవే అయియుండుటవలనను, భక్తులకు వారి సాన్నిధ్యమందు నిగూఢ దైవతత్త్వావగాహనము సులభతర మనిపించు చుండును. బ్రహ్మజ్ఞానము పుస్తకము నుండి గ్రహింపదగిన విద్య కాదు. హృదయమునుండి ప్రవహించ వలసిన అనుభవమిది. బ్రహ్మానుభూతి నొందిన సద్గురుని హృదయక్షేత్రము నుండి పొంగి పొరలి అధికారియగు సచ్ఛిష్యుని హృదయసీమ యందు దొరలునట్టిదియే బ్రహ్మజ్ఞానము. కావున నిర్మల చరిత్ర ద్వారా తమతమ హృదయ స్థానములను పునీత మొనర్చుకొనిన భక్తకోటి యంతయు అట్టి మహాత్ములు వర్షించు బ్రహ్మజ్ఞానామృతమును గ్రహించి, అనుష్ఠించి, అనుభూత మొనర్చుకొని,

జన్మసార్ధకమొనర్చుకొందురు. మహాత్ముల దివ్యావతరణముచే గలుగు పరమలాభమిదియే.

మహనీయులగు సద్గురువులు తమ జీవిత కాలమంతను అనుష్ఠానమును గూర్చియే ఎక్కువగ నొక్కి చెప్పుచుందురు. వారు స్వతః అట్లాచరించుచుందు కనుకనే ఆ యనుష్ఠానముపై వారికంత నమ్మకము ఏర్పడును. (1) గురువు (2) దైవము (3) అనుష్ఠానము అను మూడింటిని ఏ కాలమందును విస్మరించ రాదనియు, అట్లు విస్మరించనందు వలననే తమ కెంతయో శాంతి జీవితమునందు లభించిన దనియు వారు చెప్పుచుందురు. కావున వారి జీవితము నుండి మొట్ట మొదట గ్రహింపదగిన మహాపాఠమిదియే. 'అనుష్ఠానము నెన్నడును మఱువరాదు'. ప్రతిదినమున్ను ప్రతివారును నిమపూర్వకముగ భోజన మెట్లాచరించు చున్నారో, అట్లే దైవధ్యానమున్ను నియమపూర్వకముగ చేయవలసియుననుట వారి బోధలలో ప్రముఖమైనది. ఈ చిన్న నియమమే సక్రమముగ నాచరింపబడుచో అదియే సాధకుని మెల్లమెల్లగ మహోన్నత ఆధ్యాత్మిక శిఖరములకు గొనిపోగలదని వారి విశ్వాసము.

ప్రతిప్రాణియందును గొప్పగొప్ప శక్తులు విరాజిల్లు చున్నవి. అయ్యవి నిగూఢములుగ నుండుటవలన ఎవరికిని వారియొక్క పరిచయము కలుగుటలేదు. నిదురించుచున్న కుండలినీశక్తి యోగాభ్యాసముచే ఏప్రకారము పైకి లేచునో, ఆప్రకారమే మానవుని యందంతర్లీనములై యున్న దివ్యపారమార్థిక శక్తులు అతని సత్ప్రయత్నమేచే లెస్సగ ప్రస్ఫుటములు కాగలవు. బంగారము ఇతర లోహములతో గూడి యుండినపుడు దానికేమంత విలువయుండదు. కాని, బాగుగ ప్రస్ఫుటము గావింపబడి మేలిమిగా మారునపుడు దానికి గొప్ప విలువ యేర్పడుచుండును. అట్లే అజ్ఞానపరివేష్టితుడై, అసురగుణాభి భూతుడై, అపవిత్ర హృదయుడై యుండునపుడు జీవునకు విలువ యుండదు. అతని నెవరును లెక్కచేయరు. అయినను అంతమాత్రముచేత నతడు నిర్లక్ష్యము చేయదగిన వాడుకాడు. ఏలయనిన, అతనియందు పవిత్రాత్మ యుండియే యున్నది. దానిని వ్యక్త మొనర్పవలెను. సత్సాంగత్యము చేతను, మహనీయుల సద్బోధలచేతను అట్టి ఆత్మస్థితి తప్పక చేకూరగలదు. అత్తటి యింతదనుక ఎంతయో నీచుడుగ పరిగణింపబడువాడు సంఘమున సర్వోత్తముడుగ గణుతికెక్కును. కావున పాపము చెడ్డది కాని పాపి చెడ్డవాడు కాడు. పాపి ఏనాటికైనను పుణ్యాత్ముడు కాగలడు. ప్రయత్నాతిశయముచే మానవుడే మాధవుడు కాగలడు. పశువు పశుపతి కాగలడు. ఈ సత్యమునే సద్గురువులు తమ జీవితమందు పదేపదే యుద్ఘాటించుచుందురు. కాబట్టి ప్రతిజీవియు తన నికృష్టస్థితిని జూచి నిరుత్సాహము జెందక, హృదయమును చక్కగ పరిశోధించుకొని, అసుర గుణములు, దుస్సం కల్పములు, దుర్వాసనలు తమయం దేవైనయుండిన వానిని సమూలముగ తొలగించివేసి, దైవసముడై - కాదు కాదు, దైవమే అయి శోభిల్లవలెను. ఈ ప్రకారముగ అల్పుడు మహాత్ముడు కాగల్గు సదవకాశమును శాస్త్రములు జనుల కొసంగియున్నవి. కావున ప్రతి జీవియు తన హృదయమును చక్కగ వికసింపజేసికొని జీవిత పరమావధియగు స్వస్వరూప (ఆత్మ) సాక్షాత్కారమును బడసి ధన్యుడు కావలయును.

ఈ ప్రకారములైన సర్వజీవి సంతారణ రూపములగు మహత్తర సద్బోధలను మహనీయులగు సద్గురువులు కావించుచు జనుల కుత్తేజమును గలిగించుచుందురు. వారి ద్వారా ఎందఱో సామాన్యజనులు ముముక్షువు లగుదురు. ఎందఱో ముముక్షువులు ముక్తులగుదురు. శుష్కవేదాంత తమోజాలమును ప్రజల హృదయవీథులనుండి దూరీకరించుటకును, అట్లే వేదాంతభేరిని దశదిశల మారు మ్రోగించుటకును వారు కంకణము కట్టుకొందురు. అట్టి సద్గురువులను వెతకి వెతకి సంపాదించి, చిత్తశుద్ధితో వారి సేవచేసి, వారు బోధించు మోక్షమార్గమును చక్కగ అనుసరించి బ్రహ్మవిద్యను బడసి జీవితమును కృతార్థ మొనర్చుకొనవలెను.

2. ప్రకృతిని (మాయను) ఎదుర్కొనుము

ఇక మోక్షప్రాప్తికై రెండవ ఉపదేశము 'ప్రకృతిని (మాయ-అవిద్యను) ఎదుర్కొనుము' అనునది. దొంగ ఇంటిలో ప్రవేశించినను కనిపెట్టలేని వారు కొందఱు; కనిపెట్టినను ఎదుర్కొను శక్తిలేక యుండువారు కొందఱు; ఎదుర్కొని ధ్ది

చివఱకు వానితో ఘర్షణపడి తరిమివేయువారు కొందఱు. ఈ ప్రకారముగ జనులలో మూడు తరగతుల వారుందురు. మూడవ తరగతివారు జీవన్ముక్తులు. చిత్తమందిరమున ప్రవేశించిన అహంకారాది శత్రువులతో యుద్ధము చేసి వారలను పరిమార్చి తన్మందిరమున పరమాత్మను ప్రతిష్ఠింపజేసి ఈ జీవితమున పరమానంద మనుభవించువారే అట్టి మహనీయులు. మఱి కొందఱికి సరియైన ఆయుధములు లేకయు, ఉన్నను ఎదుర్కొన శక్తిలేకయు శత్రువుపై విజయమును పొందజాలక యుందురు. ఇట్టివారు పెద్దల సహవాసముచే చక్కని పారమార్థిక ఆయుధములను సమకూర్చుకొని ఏనాటికైనను శత్రువును తరిమివేయగలరు. వీరు మధ్యములు. ఇక అధములు శత్రువు ప్రక్కనే యున్నను వాని జాడ కనిపెట్టలేక తమోగుణాభిభూతులై, అజాగరూకులై అజ్ఞానాంధత్వముచే స్తబ్ధులైపడియుండి శత్రువుయొక్క దుఃఖరూప ఆఘాతములకు లోనగుచు జననమరణ ప్రవాహమున పూర్తిగ తగుల్కొనియున్న వారలు. ఇక వీరి తారణము ఎప్పటికో ఆ పరాత్పరునకే ఎఱుక!

జీవుని హృదయగేహములో అజ్ఞానమను దొంగ ఎప్పుడు ప్రవేశించెనో ఎవరికినీ తెలియదు. ఆ 'ఎప్పుడు' అను ప్రశ్నకు శాస్త్రములలో సమాధానము లేదు. సమాధానము కొఱకు యత్నించుటయు కేవలము అప్రస్తుతమే యగును. జీవుడుచేయ వలసినపని ఆ చోరుని కనుగొని త్వరలో సాగనంపుటయే. అంతియే కాని తర్కవితర్కములచే కాలయాపన చేయుటకాదు. శత్రువు బహుకాలమునుండి హృదయక్షేత్రమును ఆక్రమించుకొని యుండుటచే బలమును కూడగట్టుకొని యున్నాడు. చక్కగ కాలు నిలద్రొక్కుకొని యుండుటవలన ఒక రాగాన అతడు కదలుటలేదు. తనకేవియో హక్కు భుక్తములు ఏర్పడినట్లు అతడు భావించుకొనుచున్నాడు. ఇట్టి పరిస్థితి యందు ఒక జీవుడేమి చేయవలెను? శత్రువు యొక్క బలము చూచి, శక్తిని జూచి, అపార సామర్థ్యమును జూచి బిత్తరపడి ఊరకయుండ వలసినదేనా? కాదు, అట్లెన్నటికని చేయరాదు.

జీవునియందు అనంతశక్తి కలదు. దానిని విజృంభింపచేయవలెను. జీవుడు గొఱ్ఱెవంటివాడు కాడు. అతడు నిద్రించు సింహము. సింహము యొక్క సింహత్వమునకు ఏ కాలమునను లోటు ఉండదు. సింహము మేలుకొనిన చాలును. అట్లే అనాది కాలమునుండి అజ్ఞాన నిద్రలో పడిఉండి తన యొక్క దైవత్వమును మఱచి, కర్మబంధమున తగుల్కొని పుట్టుచు చచ్చుచు నానా యాతన లనుభవించుచున్న ఈ జీవుడు ఇపుడు నిద్రలేచి అజ్ఞానమను శత్రువును ఎదుర్కొని తన దివ్యాత్మ స్వరూపమును వ్యక్తము చేసికొనవలెను. పిరికిపందయై అజ్ఞానస్థితిని, బంధదశను ఇంకను దీర్ఘముగ కొనసాగించుట ధర్మముకాదు. ఇప్పటికే బహుకాలము దాటి పోయినది. ఇక నిద్రించుటకిది తరుణము కాదు. లేచి కర్తవ్యమునకు గడంగవలెను. మాయను ఎదుర్కొనవలెను.

సామాన్యముగా లోకములో కోతిగాని, కుక్కగాని పిరికివారలను చూచినచో తరుముకొనును, ధైర్యముగ నిలబడిన వారిని చూచి పారిపోవును. అట్లే జీవునియందుగల విరుద్ధశక్తులు (నెగటీవ్ ఫోర్స్) దుర్బలురను నానా బాధలు పెట్టును. ధైర్యవంతులకు తలయొగ్గి యుండును. మహనీయుల యొక్క జీవితచరిత్రలను పరికించినచో, వారు శత్రువు యొక్క దాడులకు ఏమాత్రము జంకక తన శక్తి యుక్తులచే వారిని జయించి వేసిన సంఘటనలు అనేకము కనిపించుచున్నవి. ఈనాటి శత్రువే జయింపబడినచో రేపు మిత్రుని పగిది వ్యవహరింపగలడు. అట్లే ఇంద్రియములను శత్రువులు జయింపబడినచో, అవి మనకు అనుకూలముగ ప్రవర్తించును. కాబట్టి ధైర్యమును కూడగట్టుకొని, పిరికితనమునకు ఏ మాత్రము తావొసంగక, మాయారూప శత్రువుతో సంగ్రామమునకు దిగవలెను. మన జన్మహక్కైన ఆత్మవస్తు సంపాదనమునకై ఎన్ని త్యాగముల కైనను సంసిద్ధులై యుండవలెను. సాహసవంతుని జయము వరించియే తీరును.

In the world's broad field of battle
In the bivouac of life
Be not like dumb driven catle
Be a hero in the strife.

అని 'లాంగ్‌ఫెలో' అను కవిసత్తముడు నుడివినట్లు ఈ విశాల జీవిత సంగ్రామ క్షేత్రమందు నోరులేని మూడ పశువులవలె వ్యవహరించక ప్రచండయోధుని భంగి అపార ధైర్యసాహసములతో వర్తించవలెను. శత్రువునకు ఏ కాలమందును వెన్ను చూపరాదు.

లోతుగ విచారించి చూచినచో ఈ మాయకుగాని, అజ్ఞానమునకుగాని, అవిద్యకముగాని వాస్తవమగు అస్తిత్వము లేదు. అది నీడవంటిది. మాయను జాచి భయపడుట తన ఛాయను జూచి భయపడుటవంటిదే యగును. నీడను తృణీకరించి, నిజవస్తువగు ఆత్మ ప్రకాశమువైపునకే దృష్టిని మరలించి, దానినే ఆశ్రయించినచో జన్మ కడతేరిపోవును. దైవబలమును చేకూర్చుకొనినవారి నుండి మాయ తప్పక పలయానము చిత్తగించి వేయును. భగవంతుని ఆశ్రయించిన వారిని మాయ ఇక ఏమియు చేయజాలదు.

మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే!

అని భగవానుడు సెలవిచ్చియే యున్నాడు. తన్నాశ్రయించిన వారు భయంకరమైన మాయను అవలీలగ దాటివేయ గలరని గీతాచార్యుల హితవచనము. చేతిలో పడవగలవారికి సముద్రము యొక్క లోతుతో పనిలేనట్లు, తన ఆత్మస్వరూపమేయగు భగవంతుని ఆలంబనమును పొందినవారు మాయయొక్క భీషణత్వమును జూచి జంకవలసిన పనిలేదు. మాయ ఎంత శక్తిమంతమైనప్పటికిని, అనాది కాలమునుండియు ఉన్నది అయినప్పటికిని, చీకటివంటిదే యగును. ప్రకాశము యొక్క ధాటికి అది తట్టుకొనలేదు. కావున జీవుడు ఆత్మజ్ఞానమను జ్యోతిని వెలిగించి ప్రకృతిని, మాయాతిమిరమును ఎదుర్కొని, దానిని అంతమొనర్చి భవబంధరహితుడై ఈ జీవితమునందే మోక్ష సామ్రాజ్యాధిపత్యమును బడయవలయును.

3. చివరి వఱకు పోరాడుము

ఒక మోక్షప్రాప్తికి గావింపబడిన మూడవ ఉపదేశము – చివరి వఱకు పోరాడుము అనునది. సామాన్యముగ పర్వతారోహకులు శిఖరమును చేరనంత వఱకు తమ లక్ష్యము నెరవేరినదని తలంపరు. సంగ్రామమున పాల్గొను సైనికులు శత్రువు జయింపబడనంత వఱకు తమ ధ్యేయము సఫలమైనదని భావింపరు. అట్లే అధ్యాత్మ మార్గమున యత్నశీలుడగు సాధకుడు బహు జన్మలనుండియు వేధించుచున్న మాయను, అజ్ఞానమును, ప్రతీపశక్తులను పూర్తిగ తుడిచిపెట్టనంత వఱకు తన కర్తవ్యము పరిసమాప్తమైనదని తలంచరాదు. మాయ నివురుగప్పిన నిప్పువలె నుండును. మనుజుడు దానిని జయించినట్లు భావించి సంబరపడుచుండును. కాని ఇంతలో ఏదియో యొక అవకాశము చూచుకొని అది తలవని తలంపుగా వచ్చి అమాంతముగ మీద పడుచుండును.

The mind has the knack of making the aspirant feel that he is its master, while in fact it makes a hopeless fool of hi.

అని ఒక మహాత్ముడు నుడివినట్లు మనస్సు జిత్తుల మారిది. తన్ను జయించివేసినట్లు తన యజమానికి అది విశ్వాసమును కలుగజేయును, కాని తృటిలో వానిని పరాభవించి తనదే పైచేయిగ గావించుకొనును. కావున సాధకులు బహుజాగరూకులై ఇంద్రియములను, మనస్సును వెయ్యికళ్ళతో కనిపెట్టి చూచుచుండవలెను. బహుజన్మార్జిత మలిన వాసనా ప్రభావముచే ఇంద్రియాదులు తమకు ప్రియములైన దృశ్యవిషయములపైకే ఉరుకుచుండును. అత్తఱి విజ్ఞుడగు వాడు వివేకమను ఆయుధమును ఆశ్రయించి వానికి ఈ క్రింది విధముగ బోధించవలెను.

'ఓ మనస్సా! ఓ యింద్రియములారా! ఎన్ని జన్మల నుండి ఈ ప్రకారము విషయముల వైపునకు మీరు పరుగెత్తుచున్నారు? మీకేమైనా తృప్తి కలిగినదా? ఇంకను కోటానుకోట్ల జన్మలు ఈ ప్రకారముగ అనుభవించినను తృప్తి కలుగునను నమ్మకమేమైనా మీకున్నదా? విషయముల వలన మీరు పొందు ఆనందము ఏపాటిది? ఎంతసేపుండును? అది శాశ్వతమా, లేక నశ్వరమా? అవిచ్ఛిన్నమా, లేక దుఃఖమిశ్రితమా? అతుకుల బొంత వంటి ఈ అల్పసుఖము కొఱకై బహు మూల్యమైన ఈ మానవజన్మను వృథా చేయుట మీకు పాడియా? దివ్యమైన ఇట్టి అవకాశములు మఱల దొఱకునా? అనంత బ్రహ్మానంద పారావారమునకు ఆహారశు

వారసులైయున్న మీరు ఈ ప్రకారముగ కక్కుర్తిపడి అల్ప వస్తువులు కొఱకు జీవితమును ధారపోయుట న్యాయముకాదు. లెండు! పరాత్పరుని పాదయుగములను సేవించుటకై తత్క్షణమే కృతనిశ్చయములు కందు!

ఈ ప్రకారముగ మనస్సునకు, ఇంద్రియములకు చక్కని హితబోధ చేసి వానియొక్క దర్పమును సాధకుడు అడంచవలెను. అయితే బహుకాలమునుండి ప్రాపంచిక వాసనలు రూఢిపడి యుండుటవలన అవి వెంటనే చెప్పిన మాట వినకపోవచ్చును. అయినను ప్రయత్నమును వీడరాదు. ఏనాటికైనను తత్త్వజ్ఞాన సహాయముచే వాసనాక్షయము పరిపూర్తిగ సంభవించి మనోనాశము ల్సెగ సిద్ధించినపుడే ఆత్మసాక్షాత్కారము కలుగగలదు. వాసనలు పైపైన నశించినట్లు కనిపించినను లోన వేరు పాతుకొని యుండును. తీగె ఎండిపోయినను దుంప నశింపనట్లు. సాధకుడు తాను చేయు సత్ప్రయత్నముల వలన వాసనల యొక్క ప్రకోపము ఒకింత ఉపశమించినను దానిని నమ్మరాదు. 'రసవర్జం' అని గీతాచార్యులు ఈ స్థితినే గీత రెండవ అధ్యాయమున చక్కగ వర్ణించి చెప్పిరి. వివేక వైరాగ్యాదులచే వాసనలు, దుర్గుణములు, దురభ్యాసములు, విషయప్రవృత్తులు సమూలముగ తొలగిపోనంతవరకు మనుజుడు సాధన చేయుచునే యుండవలెను. మధ్యలో నిలుపరాదు. Fight to the end చివరి వరకు పోరాడుము అను సూక్తి యొక్క భావమిదియే.

స్థిత్వా2స్యామన్తకాలే2పి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి

అని శ్రీకృష్ణపరమాత్మ గీత రెండవ అధ్యాయమున బ్రాహ్మీస్థితిని గూర్చి వర్ణించు సందర్భమున సాధకులకు చక్కని హెచ్చరిక చేసియున్నారు. 'ఓ సాధకులారా! పరమార్థ సాదనను అంత్య కాలము వఱకు, దేహవియోగ సమయము వఱకు నిలుపరాదు. మాయ టక్కులమారిది. మహా శక్తివంతమైనది. ఎప్పుడెప్పుడే సాధకుని పడగొట్టుదునాయని అది పొంచియుండును. కాబట్టి సాధకులారా! ఏమరుపాటు లేక శత్రువుతో చివఱివరకు పోరాడి జయించుడు.

జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్

భయంకరమైన ఈ కామక్రోధాదిరూప శత్రువును విచారణా బలముచే జయించివేయుడు. అభ్యాసముచే దానిని పారద్రోలుడు. ఇక్కార్యమున ప్రమత్తతగాని, పరాకుగాని, అలసత్వమగాని పనికిరాదు. అంత్యకాలము వరకు కూడ సాధన విషయమై బహుజాగ్రత్తగ నుండుడు' అని భగవానుని హితోపదేశము.

పరుగిడు పందెములో ఏ కొద్దిమందో పాల్గొందురు. పాల్గొనిన కొద్దిమందిలో మధ్యలోనే కొందఱు నిలిచిపోవుదురు. చివరివఱకు పోరాడి పందెము గెలుచుకొనువారు ఏ ఒకరిద్దరో ఉందురు. వారే ధీమంతులు, విజయలక్ష్మిని వరించువారు వారే. అట్లే అధ్యాత్మ క్షేత్రమునను అకుంఠితమగు దీక్ష, అప్రతిహత అధ్యయవసాయము, తీవ్రమగు పట్టుదల, ఆత్మ విశ్వాసము కలవారు మాత్రమే మాయతో చివరి వఱకు పోరాడి విజయశ్రీని చేపట్టుదురు. అనేకమంది మోక్ష ప్రాప్తికై యత్నములు చేయు చుండినను, కడవరకు పోరాటమును సాగించుచు నిలిచిన ఏ ఒకానొక ధీరుడో విజయవంతుడు కాగలుగుచున్నాడు. 'కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షత్' విషయ విరక్తి కలిగి అంతర్ముఖుడైన ఒకానొక ధీరుడు మాత్రమే ప్రత్యగాత్మను చూడగలుగుచున్నాడని ఉపనిషత్తులున్ను ఘోషించుచున్నవి.

కాబట్టి ముముక్షువు లక్ష్యప్రాప్తివఱకు తన పోరాటమును సాగించుచునే యుండవలెను. ఒక జన్మకాలము పట్టినను, రెండు జన్మల కాలము పట్టినను, అనేక జన్మలు పట్టినను మోక్షము పొందువఱకు ప్రయత్నమును విరమించరాదు. లోకమున అధమలు దైవకార్యమును ప్రారంభించనే ప్రారంభించరు. మధ్యములు ప్రారంభించి విఘ్నములు తటస్థించినను తాము ప్రారంభించిన సతాకార్యమును - దైవకార్యమును విడువనే విడువరు. పరమార్థ సాధకులు ఉత్తములవలె వ్యవహరించి గొప్ప పట్టుదలతో లక్ష్యమగు భగవత్సాక్షాత్కారమును ఎట్లైనను సాధించియే తీరవలెనుగాని, పిరికిపందలై మధ్యలోనే విరమించి పెద్దల దృష్టిలో హాస్యాస్పదులు కారాదు.

వాసనలు, అగ్ని, ఋణము, రోగము, శత్రువు, విషము – అనునవి ఏ కొంచెము మిగిలియున్నను బాధించుచునే యుండును. వానిని సమూలముగ తొలగించవలెనని నీతిశాస్త్రము బోధించుచున్నది. కావున అనాది మాయారూప శత్రువును, అజ్ఞానవైరిని హృదయ గేహము నుండి తరిమి వైచుటలో ఏమాత్రము వెనుకాడక, అతడు పూర్తిగ వైదొలగనిదే శాంతిని ఏకాల మందును నోచుకొనలేమని దృఢముగ నమ్మి అక్కార్యమును సాధించుటకు ఈ జన్మయే చక్కటి అవకాశమని విశ్వసించి, దైవముపై పరిపూర్ణ విశ్వాసముంచి, మాయతో, ప్రకృతితో కడవఱకు పోరాటము సాగించి, విజయశ్రీని చేపట్టి ఆత్మసాక్షాత్కారముచే పరమానందమును అనుభవించవలెను.

4. జగన్నాటకమును అంతమొనర్చుకొనుము

ఇక మోక్షప్రాప్తికై నాలుగవ ఉపదేశము – 'జగన్నాటకమును శీఘ్రముగ పరిసమాప్తము గావించు కొనుము' అనునది. శిరస్సుపై కట్టెలమోపు పెట్టుకొని పోవుచుండు గ్రామస్థుడు దానిని ఎప్పుడు క్రిందకు దింపి భారమును తొలగించుకొందునా యని తహతహ పడుచుండును. పగలంతయు పనిచేయు ఉద్యోగి ఎపుడు సాయంసమయమేతెంచునా యనియు, కార్యభారము ముగించుకొని ఇంటికి వెళ్ళి హాయిగ ఎపుడు కాలము గడుపుదునా యనియు పరితపించుచుండును. కాని చిత్రమే మనగా కోట్లకొలది జన్మలందు పుట్టుచున్నను చచ్చుచున్నను, దేహభారమును మోయుచున్నను, తద్వారా దుఃఖభారమును వహించుచున్నను జీవుడు ఆ భారము ఎపుడు తొలగి పోవునాయని ఆలోచించుటలేదు. పైపెచ్చు అజ్ఞానముచే దేహముతో, ఇంద్రియములతో, మనస్సుతో చేయరాని పనులు చేయుచు జన్మబంధనమును ఇంకను దృఢతర మొనర్చు కొనుచున్నాడు. దుఃఖ భారమును ద్విగుణీకృత మొనర్చు కొనుచున్నాడు. ఈ జగన్నాటకమును అంతు లేకుండ కొనసాగించుచున్నాడు. ఇది అత్యంత శోచనీయము.

All the world is a stage
And all the men and women merely players
They have their exits and their entrances

'ఈ ప్రపంచమంతయు ఒక మహానాటకరంగము. పురుషులు, స్త్రీలు అందఱును ఆనాటమందలి పాత్రధారులు. వారు రంగస్థలముపైకి వచ్చుచుందురు. పోవుచుందురు' అని షేక్స్పియర్ మహాకవి నుండివినట్లు ఈ విచిత్ర జగన్నాటక రంగములో జీవుడు వేయని వేషములేదు. ధరించని పాత్రలేదు. ఎనుబదినాలుగు లక్షల రూపములు ధరించి ఈ విశ్వరంగస్థలిపై అతడు అనాది కాలము నుండి అభినయ మొనర్చుచున్నాడు. కాని విసుగుపుట్టుటలేదు. ఈ వేషధారణకు స్వస్తిచెప్పి తనకు తానై మిగిలి పరిపూర్ణసుఖ మనుభవించు భాగ్యము నోచుకొనలేదు. ఇప్పటికే కాలము మీరిపోయినది. బంధ విముక్తిని గూర్చి తెల్పుకొనవలసిన అపూర్వ మానవజన్మ ఏతెంచినది. భగవంతుడు ఎంతయో విజ్ఞాన మొసంగినప్పటికిని మనుజుడు బంధనమును దృఢపఱచుకొని బుద్ధిపూర్వకముగ గోతిలోపడుటకే సిద్ధపడుచుండుట హాస్యాస్పదమైన విషయము. ఇక మీదటనైనను మానవుడు తన విజ్ఞతను ఉపయోగించి ఈ జన్మ పరంపరకు ఉద్వాసన చెప్పుట శ్రేయస్కరము. ఈ అనాది జగన్నాటకమును కింతటితో భరత వాక్యము పలికి, తాను ధరించు అగణిత వేషముల కొక నమస్కారము చెప్పి, జీవుడు తన సహజ నిర్వకల్ప స్వస్వరూపాత్మయందు స్థితిగల్గి పరిపూర్ణశాంతి ననుభవించుట యుక్తము.

శాంతి బాహ్యవస్తువులు నుండి లభించునదికాదు. అట్లు లభించునని తలంచుటయు కేవలము వెఱ్ఱి. శాంతి సుఖములు బయట నుండి కూరబడునవికావు. అవి లోపల నుండియే ఊరు నట్టివి. ఒకవేళ బయట నుండి ఒకింత శాంతిగాని, సుఖముగాని లభించినట్లు తోచినను అది ఎల్లకాలము నిలువదు. మఱుక్షణమే అదృశ్యమై భయంకర దుఃఖ రూపముగ పరిణమింప జీవుడు దానిచే సతమతమై పోవును. కావున ఆత్మశాంతియే పరిపూర్ణ శాంతి. పదార్థ జనితశాంతి కేవలము భ్రాంతి మాత్ర మే యగును.

రాత్రి గాఢనిద్రలో జీవుడు అవిచ్ఛిన్నముగ కొంతసేపు సుఖమనుభవించుచున్నాడు గదా! ఆ సుఖ మెక్కడ నుండి వచ్చినది? బయటనుండియా? కాదు. దేహము,

ఇంద్రియములు, మనస్సు అత్తితి లయించియుండుట వలన ఆ సుఖము బాహ్యపదార్థ జనితము కాదనుట స్పష్టము, అది అంతరము నుండియే ఆవిర్భవించినది. జడమైన సుషుప్తియందే అంతటి ఆనందము, శాంతి మానవునకు లభించుచుండ ఇక చైతన్య వంతమగు సమాధి స్థితియందాతనికెట్టి మహోన్నత శాంతి లభించునో ఊహించుకొనవచ్చును. అదియే ఆత్మశాంతి. అది అపరిచ్ఛిన్నమైనది. అదియే మన జన్మక్కు, అదియే మన స్వస్వరూపము. భక్తి, జ్ఞాన, వైరాగ్యముల ద్వారా ఇంద్రియములను, మనస్సును చక్కగ నిగ్రహించుకొనుట ద్వారా అట్టి స్వస్వరూపశాంతి జీవునకు తప్పక లభించగలదు. ఏ నిర్వికల్ప ఆనందమును జీవుడు సుషుప్తియందు తెలియకుండ అనుభవించు చున్నాడో, దానిని జాగ్రత్తు నందు తెలిసి అనుభవించుటయే సమాధిస్థితి యగును. ఇంద్రియ మనస్సంయమాదుల చేతను, చక్కని విచారణచేతను, దృశ్యము నందు విరక్తి భావము జనింప, మనస్సు అంతర్ముఖము కాగా ఇట్టి సమాధి సుఖము, పూర్ణ విశ్రాంతి జాగ్రత్తునందే జీవునకు చక్కగ లభింపగలదు. కావున అద్దాని కొఱకే ముముక్షువు లెస్సగ పాటపడి గమ్యస్థానమగు పరమాత్మను శ్రీఘ్రముగ చేరుకొనవలెను.

సామాన్యముగ దూరప్రాయణము చేయునపుడు యాత్రికుడు కొద్ది సామానును మాత్రమే తన వెంట తీసికొని పోవుచుండును. ప్రయాణము సల్పువాడు తనవెంట భారమును ఎంత తగ్గించుకొనిన అంత హాయిగ ప్రయాణము సలుపగల్గు చుండును.

Less luggage makes travel a pleasure

అని రైల్వే అధికారులు ఈ సత్యమునే ప్రయాణీకులకు చక్కగ ఉద్బోధించుచున్నారు. అట్లే జీవుడు అనాది కాలము నుండి చేయుచున్న ఈ జనన మరణ రూప దీర్ఘ సంసార యాత్ర యందు మనస్సు, దేహము, భోగ్యపదార్థములు ఇత్యాది రూప దృశ్యవస్తువులను గూర్చిన సంకల్పములను ఎంత తగ్గించుకొనిన అంత శాంతిని, సుఖమును బడయగల్గు చుండును. అపుడే మోక్షరూప గమ్యస్థానమును జీవుడను పాంథుడు ఆనందముగ చేరుకొనగల్గును. సంకల్ప భారము తగ్గుటయే, లేక తొలగుటయే శాంతికి ఏకైక మార్గము. పూర్ణశాంతికి వేఱొక ఉపాయ మొద్దియు లేదు. అనాత్మ రూపములైన దేహాది దృశ్యపదార్థముల యెడల విరక్తిగలిగి, ఆత్మయందు ఆసక్తిని పెంపొందించుకొని అట్టి ఆత్మయందు మనస్సును స్థాపిత మొనర్చుటయే పూర్ణశాంతికి ఉపాయము.

కాబట్టి ఉదయము నిద్రలేచినది మొదలు రాత్రి పరుండ వరకును లోకవ్యవహారము లనేకము లున్నప్పటికిని అవకాశమును కలుగజేసికొని ఆత్మను గూర్చియే చింతించుచు, ధ్యానించుచు, తదేకనిష్ఠుడై మెలగుచు తద్వారా అవిచ్ఛిన్న సుఖమును, పరిపూర్ణ శాంతిని జీవుడు పడయవలెను. ఈ మానవజీవితమునే చరమజన్మగ నొనర్చుకొని, జగన్నాటక వేషముల కింతటితో తిలాంజలి యొసంగి అనాది కాల సంసార దుఃఖజాలమును విచ్ఛిన్న మొనర్చివైచి ఆత్మస్థితుడై బ్రహ్మానందమనుభవించవలయును. అదియే కైవల్యస్థితి. అదియే పరమపురుషార్థమగు మోక్షము.

దైవప్రార్థన

కరుణామూర్తియగు దేవా!

మా చిత్తము సర్వకాల సర్వావస్థలయందును నీ పాదారవిందములందు లగ్నమై అచంచలమైన భక్తితో కూడి యుండునట్లు అనుగ్రహింపుము.

పరమ దయానిధీ!

ప్రాతఃకాలమున నిద్రలేచినది మొదలు మరల పరుండువఱకును మనో వాక్కాయములచే మా వలన ఎవరికిని అపకారము కలుగకుండునట్లును ఇతర ప్రాణికోట్లకు ఉపకారము చేయులాగునను సద్బుద్ధిని దయచేయు.

సచ్చిదానందమూర్తీ! నిర్మలాత్మా!

మా యంతఃకరణమునందు ఎన్నడును ఏ విధమైన దుష్టసంకల్పము గాని, విషయ వాసనగాని, అజ్ఞానవృత్తిగాని జొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుము.

వేదాన్తవేద్యా! అభయస్వరూపా!

మాయందు భక్తిజ్ఞాన వైరాగ్య బీజములంకురించి శ్రీఘ్రముగా ప్రవృద్ధము లగునట్లు ఆశీర్వదింపుము. ఈ జన్మము నందే కడతేరి నీసాన్నిధ్యమున కేతెంచుటకు కావలసిన శక్తిసామర్థ్యములను కరుణతో నొసంగుము.

పాహిమాం, పాహిమాం, పాహిమాం పాహి.

ఆహార నియమములు

- పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఆహారశుద్ధి

సాధన రంగమున ఆహారముయొక్క స్థానము చాల ముఖ్యమైనది. ఆహారము యొక్క సూక్ష్మాంశము చేతనే మనస్సున్ను శుద్ధముగ నుండును. ఆహారము సాత్త్వికముగ నున్ననే మనస్సున్ను సాత్త్వికముగ నుండును.

"ఆహార శుద్ధౌ సత్త్వశుద్ధిః, సత్త్వశుద్ధౌ ధ్రువా స్మృతిః స్మృతిలాభే సర్వగ్రన్థీనాం విప్రమోక్షః" అని ఉపనిషత్తు లుద్ఘోషించుచున్నవి. అనగా ఆహారశుద్ధిచే మనశ్శుద్ధి కలుగుననియు, మనశ్శుద్ధిచే ఆత్మస్మృతి సంభవించుననియు, తత్స్మృతి లాభముచే భవబంధము లన్నియు, అజ్ఞాన హృదయ గ్రంథులన్నియు విచ్ఛిన్నములై పోవుననియు భావము. ఆహార విషయము చాల చిన్నదని తలంచి యెవరును ఉపేక్షింపరాదు. పరమార్థ రంగమున పెద్ద పెద్ద విషయములే యోచించవలయునుగాని చిన్నవి కాదనియు, జపధ్యాన విచారణాదులు చక్కగ గావించవలెనే గాని ఆహార మెట్లున్న యేమి యనియు, దానియెడల దృష్టి యెందుల కనియు యెవరును తలంపరాదు. ఏలయనిన, చిన్న విషయముల యెడల జాగరూకత వహించినపుడే పెద్దవానియందు జయము సంభవించును.

ఒక దృష్టితో జూచినచో ఆహారమనునది చిన్న విషయమున్ను కాదు. అది అధ్యాత్మరంగమున కీలక స్థానమాక్రమించుచున్నది. ఆహారము యొక్క సూక్ష్మాంశములు మనస్సుగా రూపొందుచుండుటవలన అశుద్ధాహారము వలన మనస్సు యొక్క పవిత్రతకు భంగము కలుగు ప్రమాదమున్నది. కాబట్టి ముముక్షువు లీ యాహార విషయమున ఎంతయో జాగరూకత వహింపవలసియున్నది. మోక్షసిద్ధికి వలయు సాధనోపాయము లనేకములు తెలుపబడిన శ్రీ భగవద్గీత యందును శ్రీ కృష్ణభగవాను డీ యాహార విషయమున పలుచోట్ల సాధకులకు హెచ్చరికలు చేసియుండుట గమనింపదగినది.

"నాత్యశ్నతస్తు యోగోऽస్తి నచైకాన్త మనశ్నతః"
"యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మను"
"ఆయుస్సత్త్వబలారోగ్య.... సాత్త్విక ప్రియాః"
"కట్వామ్లలవణాత్యుష్ణ.... దుఃఖశోకామయప్రదాః"
"యాతయామం గతరసం....భోజనం తామస ప్రియమ్"

ఈ ప్రకారముగ గీతాచార్యుడు భగవద్గీతలో ఆహారశుద్ధిని గూర్చి, ఆహారసంయమమునుగూర్చి నొక్కి వక్కాణించెను. రైలు పట్టాలమీద నున్న ఒక చిన్న చీల ఊడిపోయినచో రైలుబండి యంతయు పడిపోయి ప్రయాణీకుల కెట్లు ఘోరమగు అపాయము వాటిల్లునో, అట్లే ఆహారముయొక్క అజాగ్రత్తవలన ఆధ్యాత్మిక సాధన సౌధమంతయు ఒక్కుమ్మడి కూలిపోగలదు. కనుకనే మహనీయులు తమ సాధన కాలమందును, తదుపరియున్ను ఆహార విషయమై సంయమశీలురై వర్తించుదురు.

ఆహారము యొక్క సూక్ష్మాంశముచేతనే మనస్సు ఏర్పడు చుండుటవలన పవిత్రాహారము వలననే మనస్సు సాత్త్వికమై యలరగలదు. మఱియు మనస్సు సాత్త్వికమై యుండునపుడు మాత్రమే ధ్యానము, దైవచింతన, తత్త్వ విచారణ చక్కగ జరుగగలవు. కావున మనోనిర్మాణమునకు హేతుభూతమైనట్టి ఆహారము యెడల సాధకుడు బహుశ్రద్ధగలిగి గీతయంది 17-వ అధ్యాయమందు భవానునిచే సూచింపబడిన రాజసిక తామసికాహారములను వర్జించి సాత్త్వికాహారమునే సేవించుటను అభ్యసించవలెను. తరింపదలచువాడు ఏదియో కొంత శిక్షణకు తప్పక లోనుకావలసి యుండును. అన్ని యింద్రియములను జయించుట ఒక ఎత్తు. నాలుకను జయించుట ఒక ఎత్తు.

"జితం సర్వం జితే రసే" రసనేంద్రియమగు నాలుకను జయించినచో సర్వేంద్రియములున్ను నిగ్రహింపబడినట్లే యని శ్రీకృష్ణమూర్తి ఉత్తరగీత యందు తెలిపియున్నారు. వేదాంతము

ఇంద్రియములన్నిటిలో జిహ్వ, గుహ్యేంద్రియములు రెండును మహాబలవత్తరము లైనవని యెఱుగవలెను. ఆ రెండును ఒకదానిచే మఱియొకటి సంపుష్టములగుచుండును. కావున జిహ్వను అరికట్టనిచో బ్రహ్మచర్యమును సాధించుట మహా కష్టతరమే యగును. "యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి" అను భగవద్వాక్యమును బట్టి పరబ్రహ్మసాక్షాత్కారమునకు బ్రహ్మచర్య మొక అత్యావశ్యమైన అంగమని స్పష్టమగుచున్నది. ఇక్కారణమున పరబ్రహ్మప్రాప్తికి హేతుభూతమైన బ్రహ్మచర్యమును సాధించుటకు ఆహారసంయమము, జిహ్వేన్ద్రియ నిగ్రహము అత్యంతావశ్యకములని తేలుచున్నది.

అయితే బహుకాలము నుండి బాగుగ రుచులు మరగియున్న నాలుక, సంయమమునకుగాని, సాత్త్వికాహార సేవనమునకుగాని ప్రారంభమున ఇయ్యకొనదు. తిరుగబడును. కూరలలో కొంచెము ఉప్పు తగ్గినను, కారము తగ్గినను పెద్ద తిరుగుబాటు చేయును. ఆహారమునకు సంబంధించిన ఇంద్రియములు రెండు కలవు. ఒకటి నాలుక, మరియొక్కటి పొట్ట. ఈ రెండింటిలో నాలుక మహా ప్రమాదకరమైనది. పొట్ట అమాయకమైనది. దానికి 'అశుభము, శుభము' ఏమియు తెలియదు. ఏదివేసిన దానిని స్వీకరించును. కడుపు నిండినచో 'ఇక వేయవద్దు' అని మాత్రము హెచ్చరిక చేయును. కాని ఆ హెచ్చరికను నాలుక లక్ష్యపెట్టదు. సంయమము తప్పి ఇంకను భుజించును. తత్ఫలితముగ అజీర్ణము, రోగము, తల తిరుగుడు సంభవింప ఒక నాలుకకే కాక, పొట్టకేకాక, అన్ని యింద్రియములకును కీడు వాటిల్లును. మఱియు ఉదరమునకు ఇంకొక సుగుణమున్ను కలదు. అది రుచులు కోరదు. ఆకలిని తీర్చమని మాత్ర మాదేశించును. దాని కోరిక అంతవఱకే. పదార్థము తీపిగా నున్నదా, పులుపుగా నున్నదా యను ప్రశ్నను అది లేవదీయదు. కాని నాలుక అట్లుకాదు. అది సాధకుని కొంప ముంచివేయును. పెక్కురుచులను, రుచికర పదార్థములను అయ్యది వాంఛించును. జీవుని వేధించు చుండును. ఈ నాలుకను జయించుట సాధకునకు ఒక గొప్ప సమస్యగా తయారైయున్నది.

జిహ్వేంద్రియములను జయించుట కొకే ఉపాయము కలదు. అదియే అభ్యాసము. అది కోరినది దానికి ఇవ్వకుండ కొంతకాల మభ్యాసము చేయవలెను. మొదటిలో కొంత కష్టముగనే యుండును. కాని అధిక సుఖము కొరకు అల్పసుఖమును ఎట్లైనను త్యాగము చేయవలసియున్నది. రుచుల వలన మనకు లభించు సుఖముకంటె బ్రహ్మానందము ఎన్నిరెట్లో అధికము కదా! లడ్డు మొదలైన తినుబండారముల వలన కలుగు సుఖ మెంతసేపుండును? పోనిండు, వానిని తినిన పిదప దానిని మఱచిపోవు స్థితి కలదా? లేదు. దానిని గూర్చి సంస్కారము వెంటనే యుదయించుటచే మఱల అవి యెపుడు లభించునాయని ఒకే కలవరము పుట్టుచుండును. దానిచే మనశ్చాంచల్యము, అతృప్తి, తీరని వాంఛ ఒకదాని వెంట మఱి యొకటి పరుగులిడుచుండును. కాబట్టి కొంత బాధగా తోచినప్పటికిని ఆయా రుచులను నిగ్రహించిననే జీవునకు ఎప్పటికైనను శ్రేయఃపదము సంప్రాప్తము కాగలదు. ఆ యల్పసుఖమును త్యజించిననే అనంత సుఖమును జీవుడు నోచుకొనగల్గును. అట్టి త్యాగము వలన వానికి నష్టమగునది ఏమియు నుండదు. "శతేపంచాశత్" న్యాయము ననుసరించి, అనగా నూటిలో యాభై యిమిడియున్న చందమున వారికి సంప్రాప్తించు బ్రహ్మానందమున విషయానందము లన్నియు కూడియే యున్నవని యెఱుగవలెను. కాబట్టి ప్రయత్న పూర్వకముగ నాలుక నరికట్టి, అల్ప విషయసుఖమును త్యజించి అనంత బ్రహ్మసుఖమును జీవుడు చేబట్టవలయును.

ఈ ప్రకారముగా ఆహారశుద్ధి మోక్షప్రాప్తికి హేతు భూతమగుచున్నది. మోక్షము దేనివలన లభించుచున్నది? తత్త్వజ్ఞానము వలన? అది యెట్లు కలుగుచున్నది? శ్రవణ మనన నిదిధ్యాసనముల వలన. ఆ శ్రవణాదులు దేనిచే సంభవించుచున్నవి? బుద్ధిశక్తివలన. ఆ బుద్ధిశక్తి దేనివలన పరిపోషింపబడుచున్నది? ఆహారశక్తి వలన ('తస్మాదన్న మయం మనః'). ఇవ్విధముగ ఆహారశుద్ధి మోక్షోపలబ్ధికి కారణభూతమగుచున్నది. కనుకనే ఉత్తములగు సాధకులు ఆహార సంబంధమైన ఎన్నియో నియమనిష్ఠలు శీలించు చుందురు. కొందఱు అపుడపుడు ఉపవాసములు అనుష్ఠాన

చేయుచుందురు. కొందఱు ఒక ప్రొద్దు ఉందురు. కొందఱు చాతుర్మాస్య వ్రతము నాలుగు నెలలు కొన్ని కొన్ని ఆహార పదార్థములను వారికి వారే నిషేధించుకొనుచుందురు. అట్లేల కార్తీక మాసములోఁడ, మాఘమాసములోను, మరికొన్ని పర్వదినములలోను కొందఱు ఆహారసంయమమును లెస్సగ శీలించుచుందురు. ఇది యంతయు దేనికొఱకు? స్వల్పమగు ఆహారవిషయమునందు ఇంత రాద్ధాంత మెందులకు? మహాత్ములకు తెలియకాదు ఈ నియమము లేర్పఱచినది. వారా మార్గమున నడచిరి కనుక సాధనలందు ఎక్కడెక్కడ ప్రమాదమున్నదో, ఎక్కడెక్కడ పతనమునకు అవకాశమున్నదో స్వయముగ గుర్తుంచుకొని లోకులకు ఆ విషయమందు హెచ్చరించిరి.

కావున ముముక్షువులు ఆధ్యాత్మికరంగమున కీలక స్థానము వహించియున్న ఆహార విషయమును చులకనగ త్రోసివేయక సంయమనతత్పరులై యుండవలెను. 'అన్నం బ్రహ్మ, భోక్తా చ బ్రహ్మ' అని ఉపనిషద్వాక్యము. తినబడు అన్నము, తినునట్టి వ్యక్తి ఇరువురును బ్రహ్మస్వరూపులే యని దాని యర్థము. ఈ సత్యమును గీతయు బాగుగ ఋజువు చేసినది. ఎట్లనిన 'సస్యములలో దాగి వానిని వృద్ధిపఱుచుచు ధాన్యరూపముగ నేనేయున్నాను. ప్రాణుల దేహములందు జఠరాగ్నిగ వర్తించుచు భోక్తరూపముగ నేను వెలయున్నాను' అని శ్రీకృష్ణపరమాత్మ గీతయందానతిచ్చెను. ఇవ్విధముగ భోక్త, భోజనము రెండును భగవత్స్వరూపములే యని తేలినందున భోక్త తాను శుద్ధుడగ నుండుటకు, భోజనము పవిత్రముగ నుండులాగునను జీవుడు ప్రయత్నించవలెను.

ఆహారమును బ్రహ్మభావనతో, దైవబుద్ధితో భుజించినచో ఆ యన్నము అమృత రూపముగ పరిణమించగలదు. భోజనమునకు పూర్వము భగవన్నామ స్మరణ, గోవిందనామ సంకీరతన చేయుటయో, లేక గీత 15వ అధ్యాయము పఠించుటయో కావించిన చాల ఉత్తమము. అనేక ఆశ్రమములందు, మఠములందు, గృహములందు భోజనాత్పూర్వము గీత 15వ అధ్యాయము పఠించు ఆచారము కలదు. భుజించుటకు పూర్వము చేతిలో తీర్థమును గ్రహించి

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్త సమాధినా॥

(భగవద్గీత 4-24)

అను మన్త్రమును పఠించి తీర్థమును ఆహారముపై సంప్రోక్షించి తదుపరి భుజించవచ్చును. భోజన కాలమున వాగుడు మానివేయవలెను. లోకాభిరామాయణములు, 'ప్రపంచ' కబుర్లు, కోర్టు వ్యవహారములు అచటకి తీసికొని రాగూడదు.

'స్నానే చ భోజనే హెూమే జపే మౌనం సమాశ్రయేత్'

స్నానము చేయునపుడు, భుజించునపుడు, మౌనము నవలంబించవలెనని శాస్త్రమాదేశించుచున్నది. మౌనముతో, పరిపూర్ణదైవభావనతో ఆహారమును భుజించుట మొదటి పద్ధతి. ఇది ఉత్తమోత్తమము. గోవిందనామకీర్తన చేయుచు భుజించుట రెండవపద్ధతి. ఇది ఉత్తమము. లౌకిక సమాచారములు, వ్యాపార కబుర్లు, మార్కెట్ విషయములు మున్నగునవి చెప్పుకొనుచు భుజించుట మూడవ పద్ధతి. ఇది అధమము. కాబట్టి మొదటి పద్ధతులనే జనులా శ్రయించవలెను. ఇవ్విధంబుగ దేహమనంబుల పరిపోషణ కాధారభూతమై, అతిప్రధానమైనట్టి ఈ యహారమును గ్రహించు పద్ధతిని శాస్త్రములవల, పెద్దలవలన తెలిసికొని ముముఓఉవులు తమ శరీరమును, మనస్సును పరిశుద్ధ మొనర్చుకొనవలెను.

ఆతామనందమను మహత్తర ఫలితము లభించవలె నని, ఇంద్రియార్థములవలన గలుగు అల్పసుఖమును ఎట్లైనను త్యాగమొనర్చి ఇంద్రియములను సంయమనము గావించవలెను. నోరు, ముక్కు, కన్ను, చెవి, స్పర్శేంద్రియము వీనిని అదుపులో నుంచవలెను. అవి కోరినవన్నియు వానికి సమర్పించగూడదు. ఇంద్రియములు తమ సుఖమును గోరునే కాని మన సుఖమును గాదు. తమ శ్రేయస్సునే అవి లెక్కకు తీసికొనునుగాని మన శ్రేయస్సునుగాదు. ఆ యింద్రియము లందును ఆహారమునకు సంబంధించిన జిహ్వేంద్రియము మఱియు గుహ్యేంద్రియము అతిబలవత్తరములైనవి. కావున వాని విషయమున సాధకులు అతిజాగరుకులైన వ్యవహరింప వలసి యుందురు. ముఖ్యముగా నాలుకను అరికట్టవలెను.

యోగస్య ప్రథమం ద్వారం వాఙ్నిరోధః
(వివేక చూడామణి)

అని శ్రీ శంకరాచార్యులవారు తెలిపినట్లు యోగము నభిలషించువాడు అనగా జీవాత్మ పరమాత్మల ఐక్యమును వాంఛించువాడు మొట్టమొదట తన నోటిని నిగ్రహింపవలెను. సృష్టికర్తచే జిహ్వేంద్రియమునకు రెండుడ పనులు (డబుల్ వర్క్) ఏర్పాటు చేయబడినవి, మాట్లాడుట, రుచి చూచుట అని. గుహ్యేంద్రియమునకున్ను అట్లే రెండుపనులు విధింపబడినవి. మూత్ర విసర్జన, జనన కర్మ అని. తక్కిన ఇంద్రియములన్నిటికి ఒకేపని నిర్దేశింపబడుటవలన వాని యన్నింటికంటెను ఈ రెండును బలవత్తరములై వర్తించుచున్నవి. వీనిని జయించినచో ఇక జగత్తంతయు జయింపబడినట్లే. కాబట్టి నడుము బిగించి రణరంగమున దూకిన ఆధ్యాత్మికవీరుడు ఈ రెండింటిని నిగ్రహించుటయందు గొప్ప అధ్యవసాయమును, సాహసమును జూపును. తుట్టతుదకు వానిని సంయమనముచేసి పరమార్థ విజయమును జేబట్టును.

కాబట్టి జిహ్వేంద్రియ సంయమమునకు సంబంధించన కొన్ని నియమములు, వ్రతములు తప్పక శీలించవలెను. రుచులు కోరగూడదు. సాత్త్వికాహారమునే సేవించవలెను. అదియు మితముగా భుజించవలెను. భుజించుటకు ముందుగా ఆ పదార్థమును దైవమున కర్పించవలెను. మఱియు సేవింపబడు ఆహారము న్యాయార్జితముగా నుండవలెను. ఈ ప్రకారముగ ముముక్షువు తాను గైకొనునది (1) సాత్త్వికాహారము (2) మితాహారము (3) దైవార్పితాహారము (4) న్యాయార్జితాహారము అయియుండు లాగున చూడవలెను. చిత్తశుద్ధిని, తద్వారా మోక్షమును అభిలషించు ప్రతిమానవుడును తన దేహోద్యుపాధి యొక్క ప్రధాన పరిపోషక పదార్థమగు ఆహారవిషయమై ఈ నాలుగు జాగ్రత్తలను తప్పక వహించవలసియున్నది. ఈ నాల్గింటిని గూర్చి ఇపుడు వివరముగ యోచించెదము.

(1) సాత్త్వికాహారము : ఆహారము యొక్క సూక్ష్మాంశముచే మనస్సు ఏర్పడుటబట్టి సాధకుడు తాను గైకొను ఆహారము తమోగుణ, రజోగుణ ప్రేరకమైనది కాకుండ సత్త్వగుణాభి వృద్ధికరముగనే యుండునట్లు చూడవలెను. ఆహారమునందు కారము, పులుపు, ఉప్పు క్రమముగ తగ్గించుకొనుచు రావలెను. మధుమాంసములను వర్జించవెలను. గీత 17వ అధ్యాయమున భగవానుడు తెలిపిన రాజసతామసా హారములను విసర్జించి సాత్త్వికాహారమునే సేవించవలెను. అత్తఱి మనస్సున్ను సాత్త్వికములైన యణువులచే విరాజిల్లు చుండును. ఇంత మాత్రముచేతనే ఆహార సంబంధమైన కట్టుబాటు పూర్తి అయినదా యనిన, కాదు. ఇంకను అనేక జాగ్రత్తలు దానిని గూర్చి వహింపవలసి యున్నవి. ఆహారము సాత్త్వికమైనను దానిని అధికముగా భుజించుటవలన గూడ ప్రమాదము కలదు. కాబట్టి మితాహారపద్ధతిని గూడ అవలంబించవలెను.

(2) మితాహారము : మన చుట్టును కావలసినంత గాలియున్నది గదా యని యెవరైనా గాలిని ఎక్కువగా పీల్చుచున్నారా? లేదు. ఎంత అవసరమో అంతే పీల్చుచున్నారు. మన చుట్టును బావులందు, దొఱువులందు, పంపులందు కావలసినన్ని నీళ్ళున్నవిగదా యని యెవరైనా అధికముగా నీళ్ళు త్రాగుచున్నారా? లేదు. ఎంత ఆశ్యకమో అంతే స్వీకరించుచున్నారు. అట్టిచో ఒక్క ఆహారమును మితము దప్పి యేల భుజించవలయును? అట్లు భుజించుటవలన కడుపు బరువెక్కి, ధ్యానము సరిగా జరుగదు.

ధ్యానము మాట అట్లుండనిండు. కొంచెముసేపు కూర్చొనుటకు కూడ సాధ్యపడదు. అధికంగా తిన్నవాడు క్రిందపడి దొర్లుచు నానావస్థలు పడుచుండును. ఆయాసమును పోగొట్టుటకు భోజన మేర్పడినది. కాని మితిమీరి తినినచో ఆ భోజనవే ఆయాసమును గలుగజేయును. దానిపేరే 'భుక్తాయాసము'. జనులుకోరి తెచ్చుకొను జబ్బు ఇది.

మితిమీరి ఆహారమును గైకొనుటవలన మూడు అనర్థములు కలుగుచున్నవి. (1) భుక్తాయాసము తీర్చుకొనుటకై క్రిందపడి దొర్లుటలోను, నిద్రించుటలోను ఒకటి, రెండు గంటల సమయము అమూల్యమగు ఈ

మానవజీవితములో ప్రతిదినము వ్యర్థమైపోవుచున్నది. (2) తాను అధికముగా తినుటవలన, ఒక ప్రాణి యొక్క ఆహారములో కొంత భాగము తస్కరించినట్లే యగుచున్నది. తాను మితముగ భుజించినచో తనకు మిగిలిన ఆహారము వలన 'అన్నమో రామచంద్రా' యని అల్లాడు బీదజను డొకడు పోషింపబడును గదా! కావున అధిక భోజనము వలన పరప్రాణియొక్క ఆహారమును దొంగిలించిన మహాపాతకము జీవునకు సంభవించుచున్నది. (3) అతిశయ భోజనముచే మనుజునకు ఆరోగ్యము భంగమై పోవుచున్నది. వైద్యులను ప్రశ్నించినచో ఎక్కువ రోగములు సంయమము తప్పి భుజించుటవలననే కలుగుచున్నవని చెప్పుదురు. ఇవియన్నియు మానవుడు కొనితెచ్చుకొను వ్యాధులే యని చెప్పవలసియున్నది. కాబట్టి పైన దెలిపిన మూడు అనర్థములు లేకుండుట కొఱకై సాధకుడు ఆహార విషయమునందు బహుజాగ్రత్త వహింపవలసి యుండును. మితాహారమునే సేవించవలెను.

మితాహారము యొక్క లక్షణము లేఇ యనిన –

ద్వౌ భాగౌ పూరయేదన్నై స్తోయేనైకం ప్రపూరయేత్ ।

మారుతస్య ప్రచారార్థం చతుర్థమవశేషయేత్ ॥

కడుపు మొత్తమును నాలుగు భాగములుగ ఊహించినచో, అందు రెండు భాగములను అనగా సగము కడుపును అన్న శాకాదులతో నింపవలెను. ఒక భాగమును అనగా పాతిక కడుపును నీళ్ళతో నింపవలెను. మిగత పాతిక భాగమును గాలియాడుట కొఱకు ఖాళీగా నుంచవలెను. శాస్త్రము లీప్రకారముగా ఆదేశిచంఉచుండ కొందఱు రెండు భాగములు కాదు, మూడు భాగములు కాదు, నాలుగు భాగములున్ను అన్నముతో నింపి, నీళ్లు త్రాగుటకు కూడ చోటులేక, గాలి ఆడుటకు అవకాశమే లేక నానా అవస్థలు పడుచున్నారు. ఇట్టి వారికి ధ్యానాధులబ్బుట బహుప్రయాసము.

అయితే ఆహారము ఏమాత్రము స్వీకరింపక కేవలము నిరాహారులుగా నుండువారికిన్ని ధ్యానము సరిగా కుదరదని గీతయందు చెప్పబడినది. ఏలయనగా, ఆహారము లేనందుచే శరీరము, మనస్సు రెండును శుష్కించును. అత్తటి దైవచింతనకే అవకాశముండదు. జడముగ రాతివలె పడియుండవలసి వచ్చును. లేక నిద్రించవలసివచ్చును. తమోగుణ సంబంధమగు అట్టి స్థితివలన జీవున కేమాత్రమున్ను ప్రయోజనము లేదు. పూర్వము 'ఉరూవల' అను యరణ్యమున తపస్సు చేయునపుడు బుద్ధదేవుడు ఆహారమును బొత్తిగా మానివైచి శరీరమును క్షీణింపజేసెను. దానివలన మనస్సున్ను చింతనా శక్తిని గోల్పోవ, ధ్యానమే యాతనికి కొనసాగలేదు. కూర్చొనుట కున్ను శక్తిలేక యుండెను. అత్తటి సమీప గ్రామమునకు చాల ప్రయాసతో జని కొంచె మాహారమును స్వీకరించి తెప్పరించుకొనెను. అప్పటి నుండియు బుద్ధదేవుడు తన ధ్యానాదులందు ఆహార విషయమున మధ్య మార్గమును అవలంభించుచు చక్కని ఫలితములను బడయగల్గెను. కనుకనే భగవద్గీతయందు

యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।

యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥

అని బోధింపబడినది. అనగా ఆహార, విహార, నిద్రాదులందు యుక్తత్వమును (మితత్వమును) శీలించువానికి యోగము (ధ్యానము) చక్కగా జరుగగలదని భావము. కాబట్టి ధ్యాననిష్ఠుడు తన సాధనలందు విజయమును జేబట్టుటకై, పురోభివృద్ధిని బడయుటకై ఆహారాదులందు మితత్వమును అభ్యసించవలెను.

(3) దైవార్పితాహారము : ఆహారము సాత్త్వికముగను, మితముగను నున్నప్పటికిని భగవంతున కర్పానిని నివేదింపకుండ భుజించినచో అది సత్ఫలితముల నొసంగ జాలదు. అన్నమును మానవుడు సృష్టించలేదు. సర్వేశ్వరుడు తనయొక్క అమోఘ దివ్యశక్తిచే భూమినుండి ఓషధులను సృజించి వానిని జీవులకాహారముగ నొసంగెను. ఈ సత్యమును భగవాను డీ క్రింది శ్లోకము ద్వారా గీతయందు స్పష్టీకరించి యుండెను.

గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా।

పుష్ణామి చౌషధీస్సర్వా స్సోమో భూత్వా రసాత్మకః ॥

కాబట్టి భగవాను డొసంగిన యాహారమును తిరిగి భగవానునకు సమర్పింపకుండ భుజించువాడు కృతఘ్నుడే

యగును. మఱియు నట్టివాడు పాపమును భుజించువాడే యని గీతాచార్యుడు పేర్కొనియుండుట గమనింపదగినది. (భుఞ్జతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్). కావున ప్రతివారును ఆహారమును భుజించుటకు ముందు దానిలోని కొంత భాగమును లేక ఒక కబళమును ఏదైన యొక ప్రాణికిపెట్టి, చేతియందు తీర్థమును గ్రహించి -

బ్రహ్మార్పణం బ్రహ్మ హవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా ॥

అను మంత్రమును ఉచ్చరించి, ఆ తీర్థమును అన్నాదులపై ప్రోక్షించి దైవభావనతో భుజించవలెను. ఈ ప్రకారముగ భగవానునకు నివేదించి దైవభావముతో భుజింపబడు యాహారము అమృతతుల్యమై జీవునకు పరమశ్రేయమును ఒనగూర్చగలదు.

4. న్యాయార్జితాహారము : అన్యాయముగ ఆర్జించిన దానిని స్వీకరించుట వలన సాధకుని చిత్తమున మాలిన్య మేర్పడగలదు. ఇక్కారణమున ఆహారమును సంపాదించు మార్గము న్యాయమైనదిగ, ధర్మపూర్వకమైనదినుండుట అత్యావశ్యకము. ఇతరులను కొల్లగొట్టి, బాధించి, మోసముచేసి తెచ్చు ద్రవ్యముచే నేర్పడు ఆహారము పవిత్రమైనది కాదు. కాబట్టి ఈ విషయమై కూడ సాధకులు చాలా జాగరూకులై యుండవలెను.

ఇవ్విధముగ ముముక్షువు తాను గ్రహించు ఆహారము సాత్త్వికమైనదియు, మితమైనదియు, దైవార్పితమైనదియు, న్యాయార్జితమైనదియు అయి యుండినచో, అద్దానిచే నేర్పడు, శరీరము, మనస్సు రెండును పవిత్ర వంతములై యలరుచు పరమాత్మ సాధనమున యాతనికి మహోపకృతి నొనగూర్చగలవు.

మఱియు బుజించునపుడు మౌనముగా నుండవలెను. ప్రాపంచిక విషయము లెవ్వియు అచ్చోట ప్రస్తావింప బడరాదు. దైవభావముతో భుజింపవలెను. అత్తఱి యా భోజనము అమృతముగా పరిణమించి, జీవుని రక్తమును, మేధస్సును పరిశుభ్రపరచి దైవగంధయుతముగ నొనర్పగలదు.

భోజన విషయమై ఈక్రింది నియమములను గూడ పాటించుట మంచిది.

(1) దినమున కనేకసార్లు భుజింపరాదు. రెండు పర్యాయములు లేక సాధ్యనమైనచో ఒక పర్యాయము భుజించుట ఆరోగ్యకరము.

(2) భోజనమునకు భోజనమునకు మధ్య చిరుతిండి తినరాదు.

(3) మితముగా పెట్టించుకొని, పెట్టించుకొనిన పదార్థమును పారవేయక భుజించవలెను. పారవేసినచో బ్రహ్మస్వరూపమగు అన్నమును నిందించినట్లే యగును. (అన్నం బ్రహ్మ - అన్నం న నిన్ద్యాత్, తద్వ్రతం)

(4) భోజన కాలమున ఏమియు మాట్లాడరాదు. దైవభావము గల్గి భుజించవలెను.

ఈ ప్రకారముగ ఆహార విషయమై తగుజాగ్రత్తలు వహించినచో సాధకుని దేహమనంబులు పరిశుద్ధములు కాగా, ఆధ్యాత్మమార్గ మతనికి అత్యంతసుగమమై యొప్పార గలదు. ఆరోగ్యవిషయమున అపక్వాహారమున్ను గొప్ప సత్ఫలితములను కలుగజేయగలదు.

అపక్వాహారము :

సృష్టియందు 84 లక్షల జీవరాసులున్నప్పటికిని వంట చేసికొని భుజించువాడు అందు మానవుడొక్కడే అయి యున్నాడు. తక్కిన (84 లక్షలు-1) జీవరాసులన్నియు అపక్వాహారమునే భుజించుచున్నవి. ప్రకృతి సిద్ధమగు ఆహారమునే గైకొనుచున్నవి. తత్ఫలితముగ ఆరోగ్యముగ నుంటున్నవి. మానవుడో, ప్రకృతి యందు నైజముగ లభించిన ఆహారపదార్థములను వికృతి యొనర్చి, జిహ్వాచాపల్యముచే వానికి పెక్కు రుచులను కల్పించి భుజించుట వలన ఆరోగ్యము చెడుటచే పెక్కు వ్యాధులకు లోనగుచున్నాడు.

ఈ ప్రపంచమున ఆరోగ్యమునకు మించిన వస్తువులు మఱియొకటి లేదు. ఆరోగ్యమే మహాభాగ్యము (హెల్త్ ఈజ్ వెల్త్). రోగియగువాడు ప్రపంచమున ఏ కార్యమును సాధించలేడు. మఱియు ఐహిక, ఆముష్మిక సుఖములను వేనిని గూడ అనుభవించనులేడు. కోటి రూపాయలున్నప్ప

టికిని కడుపునొప్పితో బాధపడువాని కేమైనా సుఖముండునా? భూమండలమున కంతకును ఏకచ్ఛత్రాధిపతియైనప్పటికిని, గొప్ప అధికారము, పదవి లభించినప్పటికిని, జీర్ణకోశము నందేదైన లోపముండినచో మనుజుని ముఖమున ఆనందము కన్పించునా? కాబట్టి సమస్త సుఖములకును, సాధనలకును, వాయవహారిక, పారమార్థిక క్రియలకును ఆరోగ్యమే మూలకందము. "శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్" అని శాస్త్రజ్ఞులు చెప్పనే చెప్పిరి.

అట్టి ఆరోగ్యమును కాపాడుకొనుటకు ఎట్టి ఆహారము మనుజునకు ఆవశ్యకమో విచారించవలసి యున్నది. ప్రకృతి యందు స్వతస్సిద్ధముగ లభించిన వస్తువులను ఉ డకబెట్టునపుడు వాని యందలి కొన్ని జీవాణువులు నశించిపోవును. దృష్టాంతమునకు ఒక పెసరగింజగాని, శనగ గింజగాని, కంది గింజగాని యున్న దనుకొనుడు, దానిని భూమిలో పెట్టి ఒకటి రెండు రోజులు నీళ్లు చల్లినచో వెంటనే మొలకెత్తును. దాని యందలి జీవశక్తులత్తతి వికసించును. కాని ఆ గింజనే పెనముపై వేయించి లేక ఉడకబెట్టి భూమియందు నాటినచో కోటి సంవత్సరములకైనను అది మొలకెత్త నేరదు. కారణమేమి? దానిలోని జీవకణములు కొన్ని నశించిపోయినవి. జీవశక్తులచే పరిపూర్ణమైయున్న పదార్థమును గైకొనుటయే మనుజునకు ఉత్తమము. అనగా పక్వముకాని వస్తువును, అపక్వాహారమును స్వీకరించుటయే ఆరోగ్యకరము. అయితే గోధుమలు కాని, పెసలుకాని, శనగలుకాని పచ్చివి నమలుటకు కఠినముగా నుండును. గావున వానిని కొంతసేపు నీటిలో నానావేసి భుజించవచ్చును. తాజాఫలములను స్వీకరించుట వలన ఆరోగ్యమెంతయో పెంపొందును.

అపక్వాహారము గైకొనువారికి నారికేళము (కొబ్బరి కాయ) అతి ముఖ్యమైనది. మన పూర్వులు నారికేళమునకు ఎంతయో పూజ్యత్వమును కల్పించిరి. దేవతలందఱికిని నారికేళము ప్రియమగు నైవేద్యముగా సమర్పింపబడుచున్నది. ఇంటియందుగాని, దేవాలయమునందు గాని ఏ పూజ జరిగినను టెంకాయ కొట్టవలసినదే. కలశములపై నారికేళముల నుంచి వానిని దైవస్వరూపములుగ భావించి పూజించుచుండుట పూజాదులందు జనులకు నిత్యాచారమై యున్నది. కొబ్బరి కాయయొక్క యాకారమును జూచినను అది మానవుని శిరమును బోలియుండును. రెండు నేత్రములు, ఒక నోరు, జుట్టు, మెదడు, రక్తము (నీరు) గలిగి యలరుచుండును. దీనిని 'విశ్వామిత్రప్రియ' యనియు కొందఱు చెప్పుదురు.

ఆరోగ్యమునకు ఎంతయో సహాయపడు నట్టిదియు, అతి విలువ గలిగినదియునగు 'రేడియం' అను పదార్థము కొబ్బరి కాయయందు ఎక్కువగ గలదని ఇటీవల శాస్త్రజ్ఞులు పరిశోధనచే కనిపెట్టిరి. ఇంకను కొబ్బరి యందు ఈక్రింది పదార్థములు కలవని తేల్చబడెను.

– (నూరు వంతులలో)

మాంసకృత్తులు (Protiens)	6.6
క్రొవ్వుపదార్థములు (Fats)	56.2
పిండిపదార్థములు (Carbo-Hydrates)	13.7
లవణములు (Mineral Salts)	1.6
పిప్పి (Crude fibre)	8.9
నీరు (Water)	13.0
	100.00

దీనిని బట్టి శరీరపుష్టికి, ఆరోగ్యమునకు వలసిన పదార్థములు నారికేళమునందు విశేషముగ కలవని స్పష్టపడుచున్నది. దంతపుష్టికలవారు కొబ్బరిని ముక్కలుగా చేసి తినవచ్చును. దంతపుష్టిలేనివారు తురుము కొని తినవచ్చును. కొబ్బరి, అరటిపండ్లు, గోధుమలు, శనగలు లేక పెసలు ఈ నాలుగున్ను అపక్వాహారము స్వీకరించువారికి చాల అవసరములైయున్నవి. గోధుమలు, శనగలు, లేక పెసలు నానవేసికొని భుజించవలెను. మొలక వచ్చిన పిదప తినుటయు మంచిదే. వారివారి జీర్ణశక్తిననుసరించి, ఆకలి ననుసరించి పూటకు ఒక గుప్పెడు గాని, రెండు గుప్పెళ్లు గాని, లేక మూడు గుప్పెళ్ళుగాని గోధుమలు, శనగలు లేక పెసలు వాడుకొనవచ్చును. పండ్లు ఏమి భుజించినను మంచిదే. కాని అన్నిటికంటె అరటిపండు శ్రేష్ఠమైనది. అది

సులభముగను, చవుకగను గూడ లభించును. పండ్లు దొరకనిచో పచ్చి కాయగూరలు కూడా వాడుకొనవచ్చును. ఉడికిన పదార్ధమేమియులేక, రెండు పూటలు ఈ అపక్వాహారము భుజించుట సర్వశ్రేష్టము, దానిచే రోగములున్ను హరించిపోవును. కావున రోగములు కలవారు కనీసము వాడు రోగములు తొలగువఅకైనను ఈ అపక్వాహారమును శీలించుట చాల ఉత్తమము. ఇక, ఎల్లప్పుడును శీలించినచో అంతకు మించినదేలేదు.

ఒకవేళ రెండుపూటలు అవక్వాహారమును సాధింపలేనిచో కనీసము రాత్రిపూటయైన అన్నము మాని ప్రకృతి ఆహారమును స్వీకరించుట మంచిది. బాగుగ అభ్యాసమైన వెనుక పూర్తిగ అన్నమును విసర్జించవచ్చును. ఈ అపక్వాహారమును సాధించు కాలములో పాత మురికి రక్తము పోయి మనుజునకు దాని స్థానమందు క్రొత్త నిర్మల రక్తమేర్పడును. కావున ఆ మార్పుదల సమయమున ఒకవేళ ఏవైన కురుపులు, దగ్గు మొదలైన వికారము లొకింత కనుపించినను దానిచే సాధకుడు ఏమాత్రము జంకరాదు. బెదిరిపోరాదు. తన నియమమును అప్రతిహతముగ కొనసాగించుచునే యుండవలెను. అట్లు చేసినచో కొంత కాలమునకా వికారములన్నియు తొలగిపోయి చక్కని ఆరోగ్యము మనుజున కేర్పడగలదు. కొందఱు కొబ్బరి అజీర్ణమును గలుగజేయుననియు, అరటిపండు వాతమనియు, గోధుమలు వేడిచేయుననియు, శనగలు కడుపుబ్బరము కలిగించుననియు ఇట్లు పరిపరి విధములుగా ఆయా వస్తువులును గురించి చెప్పుదురు. కాని, ఆయా వికారములన్నియు ఉడికిన పదార్థముల (అన్నాదుల) తోపాటు వానిని అధికముగ స్వీకరించినపుడు ఒకవేళ కలిగిన కలుగ వచ్చునేమోగాని, ఉడికిన పదార్థమును పూర్తిగ త్యజించి కేవలము ఉడకని వానినే సేవించునపుడు అనగా అపక్వాహారమును గైకొనునపుడు ఎంతయో ఆరోగ్యము గలుగజేయును, పైగా పెక్కు రోగాదులను నివారించును. కాబట్టి ఆరోగ్యమును కాంక్షించువారు, రోగ బాధను తొలగించుకొనదలంచువారు ప్రయత్నపూర్వకముగ కొంత కాలమైనను ఈ అపక్వాహారమును శీలించుట ఉత్తమము. ఆధ్యాత్మిక రంగమున ప్రవర్తించు సాధకులకీ యపక్వాహారము ఎనలేని సహాయమును చేకూర్చును. ఏలయనగా సత్త్వగుణము నయ్యది మిక్కుటముగ అభివృద్ధిపరచి రజోగుణ తమోగుణములను పారద్రోలును. కావున ముముక్షువుల కీయాహారము వరప్రసాదమేయగును.

యోగాసనాలు



యోగాసనాలు

అనుష్ఠాన వేదాంతము

పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

మోక్షానుభూతికొఱకై సాధకుడు అనేక యత్నముల నాచరించుచున్నప్పటికినీ, అనేక యోగములను శీలించుచున్నప్పటికిని, నిత్య వ్యవహార మందు పరప్రాణి యెడల దయ, కరుణ, ప్రేమ గలిగి యుండనిచో ఆ ప్రయత్నములు పూర్ణ సాఫల్యమును గలుగ జేయజాలవు. ప్రతి జీవిని తనవలెనే చూచుకొనుచు సాధకుడు ఉదారవైఖరిని అవలంబించవలెను. అట్లుకాక, ఒకవైపు యోగములను అభ్యసించుచు, మఱియొక్క వైపు పర్వప్రాణియెడల ద్వేషభావము గలిగి యుండుచో అతని పరిస్థితి మందును తిని పథ్య మాచరించనివాని చందముననే యుండును. అత్తఱి భవరోగ మతనికి తొలగనేరదు.

రోగికి మందు ప్రధానమైనది. కాని పథ్యము ఇంకను ప్రధానమైనది. మందు తిని పథ్యము సరిగా ఆచరించనిచో, రోగము నయము కాకుండపోవుటయే కాక పై పెచ్చు కొన్ని విపరీతములు కూడ కలుగవచ్చును. కనుకనే వైద్యులు మందు ఇచ్చునపుడు ఆహార విహారము లందు కొన్ని నిషేధములను ప్రత్యేకముగ చెప్పుచు, నిషిద్ధ వస్తువులను ఏ పరిస్థితులందును ఆచరించరాదనియు రోగులకు హెచ్చరిక చేయుచుందురు. వారు చెప్పు హితవాక్యములను రోగులు తప్పక పాటించవలసి యుందురు. అట్లు కానిచో విపత్కర అనారోగ్య పరిస్థితులను వారు ఎదుర్కొనక తప్పదు. మందుగదా ప్రధానము. పథ్యమెట్లుండిననేమి, అని తలంచి ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించుచు స్వేచ్ఛావిహారులై మెలగు రోగులు చేతులారా తమ శరీరమును తామే పాడుచేసికొనిన వారగుదురు.

అట్లే ఆధ్యాత్మిక క్షేత్రమున శాస్త్రములు, అనుభవజ్ఞులగు పెద్దల భవరోగ నిర్మూలనమునకు చక్కని ఔషధములను పేర్కొని 'ముముక్షువులారా! వీరిని సేవించి బహుకాలము లోన జీవించియున్న ఈ సంసారదుఃఖమను రోగమును అంతము చేసికొనుడు. కర్మయోగము, భక్తి యోగము, రాజయోగము, జ్ఞానయోగము అను ఔషధములను చక్కగ సేవింపుడు. అయిత, మీ నిత్య ఆచరణయందు, దైనందిన జీవిత వ్యవహారమందు బహుజాగరూకులై ఒక్క ప్రాణికైనను హింసను కలుగజేయక, ఎవరిని బాదింపక, పరోపకార పరాయణులై సదాచారము గలిగి వర్తింపుడు, ఇదియే పథ్యము అని హితము చెప్పుచున్నారు. వారి హితవాక్యములను పెడచెవినిపెట్టి మందు మాత్రము సేవించి పథ్య మాచరింపనివారు శాంతిని, దుఃఖరాహిత్యము నెన్నటికిని నోచుకొనజాలరు. జపము, ధ్యానము, ఆత్మ విచారణ మున్నగునవి యన్నియు మందు. భూతదయ, పరోపకారము, పవిత్రాచరణ మున్నగునవి పథ్యము. కావున రెండింటని శీలించువాడు భవరోగరమితుడై పరిపూర్ణ శాంతిని అనుభవించగలడు.

పూర్వమొక గ్రామములో ఒకానొక పండితుడుండెడివాడు. అతడు ప్రతిదినము మధ్యాహ్నము 3 గంటల నుండి 4 గంటల వరకు దేవాలయములో పురాణము చెప్పుచుండెడివాడు. ఒకనాడాతని కాలక్షేపమునకు అందరు స్త్రీలే వచ్చి వినుచుండిరి. ఆరోజు పతిభక్తిని గూర్చిన ప్రసంగం నడిచెను. కాలక్షేపమంతయు పూర్తి అయిన వెనుక పౌరాణికుడు శ్రోతల నుద్దేశించి యిట్లు పలికెను. 'అమ్మలారా! ఈ రోజు అదృష్టవశాత్తు మీకు తగిన బోధే వచ్చినది. పతి భక్తిని గూర్చిన విచారణే ఇపుడు జరిగినది. పతిభక్తి అనునది చక్కని ధర్మము. అంగనామణులు తమ భర్తనే దైవముగా భావించి వారికి సేవచేయుచుండుట మహాపుణ్యప్రదము. కాబట్టి ఈ పతిభక్తియను ధర్మమును మీరు నిరంతరము జ్ఞాపకము నందుంచుకొనుడు. అట్లా ధర్మము సదా మీ స్మృతి పథమున నుండుటకై నేనొక ఉపాయమును చెప్పెదను.

ఆ ప్రకార మాచరించుడు. ప్రతిరోజు ఉదయము స్నానము చేయగనే ఒక జపమాల తీసికొని 108 పర్యాయములు 'పతిభక్తి' అను నామమును జపించుచుండుడు. అత్తతి ఆ బోధ మీ హృదయఫలకము నందు బాగుగా హత్తుకొని పోవును"

పౌరాణికుని యీ హితకర వచనములను విని మహిళామణులందఱును చాల సంతసించి అట్లే చేయుదుమని వాగ్దానముచేసి వారి వారి గృహములకు వెడలిపోయిరి. మఱుసటి దినము ప్రొద్దుననే లేచి ఒక గృహిణి స్నానాదులను నిర్వర్తించుకొని జపమాల తీసికొని ఒకచోట కూర్చొని పౌరాణికుని ఆదేశ ప్రకారము 'పతిభక్తి' అను పలుకుచు జపమాల పూసలను త్రిప్పుచుండెను. ఇంతలో ఆమె భర్త అచటికి రాగా వారిరువురికి ఈక్రింది సంభాషణము జరిగెను.

భర్త – 'ఏమే! ఇంకా పొయ్యి రాజేయలేదేమి? ప్రతిరోజూ ఈ పాటికి ఫలహారము పూర్తిచేసేదానవు. నాకు ఆపీసుటైము అవుతూంది. త్వరగా లేచి ఆపనిచూడు.

భార్య – ఏమండీ! జపం అష్టోత్తరం ఇంకా పూర్తి కాలేదండి. పూర్తిచేసి త్వరలో వస్తున్నా.

భర్త – ఎవరినామం జపం చేస్తున్నావు?

భార్య – తమరిని గూర్చిన నామమే. 'పతిభక్తి' అనే మంత్రజపం చేస్తున్నా.

భర్త – బాగుంది! పతిని ఎండగొట్టి పతిని గూర్చిన జపమేమిటే? అని భార్యను మందలించెను.

లోకములో ఇపుడు చాలచోట్ల ఈ ప్రకారవే జరుగుచున్నది. భగవంతుని గూర్చి జపము చేయుచు, భగవంతుని స్తోత్రము కావించుచు, భగవంతుని స్వరూపులే యగు జీవరాసుల యెడల, పరప్రాణుల యెడల ద్వేషము, అసూయ, క్రోధము, వైమనస్యము కలిగియుండుచున్నారు. స్వేచ్ఛాచరణ కలిగి ప్రవర్తించుచున్నారు. ఇది మందు తిని పథ్య మాచరింపకుండుటయే యగును.

ఇట్టి క్రియలవలన జనులకు శాంతి సుఖము లెన్నటికిని కలుగనేరవు. కనుకనే శ్రీకృష్ణపరమాత్మగీత యందు–

"మత్కర్మకృన్మత్పరో మద్భక్త స్సఙ్గవర్జితః ।

అని నాలుగు యోగములు (కర్మ యోగము, భక్తి యోగము, రాజయోగము, జ్ఞాన యోగము) చెప్పి వెనువెంటనే

నిర్వైర స్సర్వభూతేషు యస్స మామేతి పాణ్డవ॥"

సర్వభూతములందును, దయగలిగియుండవలెనని ఆదేశించెను. నాలుగు యోగములు మందు. భూతదయ, సదాచారము పథ్యము. కావున మందుతోపాటు పథ్య మాచరించు విధమున యోగాచరణతోపాటు జీవకారుణ్యము, సదాచారము కూడ నిత్యజీవితమునందు కలిగి యుండ వలెను. దేవునకు నమస్కరించి జీవుని తిరస్కరించినచో ఏమి ప్రయోజనము? జీవుడు కూడ దేవుని స్వరూపమే యగును. 'నా అంశమే జీవుడని' గీతాచార్యుడు ఘంటాపథముగ పలికిన వాక్యములను ముముక్షువులు స్మృతి పథమున నుంచుకొని, దేవునివలె జీవుని కూడ ప్రేమించుచు, వాని యెడల దయా దాక్షిణ్యములు కలిగి ప్రవర్తించుచు నుండవలెను. అప్పుడు మాత్రమే అనుష్ఠానము పరిపూర్ణత్వము నొందగల్గును.

కావున జనులు అధ్యాత్మక్షేత్రమున ఎన్ని సాధన లాచరించినను నిత్యజీవితమున ప్రతిప్రాణియెడల దయ గలిగి యుండుచు సదా జీవకారుణ్యము ప్రతిప్రాణియెడల దయ గలిగి యుండుచు సదా జీవకారుణ్యము నలవఱచు కొనుచు, ఇవ్విధముగ ఔషధముతోపాటు పథ్యమును కూడ సేవించి అనుష్ఠాన వేదాంతమును శీలించుచు బహుకాలరూఢమగు భవరోగమును బాపుకొని సుఖించవలెను.

ముముక్షువగువాడు తన నిత్యజీవితమున ఎట్లు ప్రవర్తించవలెనో, లోకమునం దెట్లు వ్యవహరించవలెనో, ఎట్టి యాచరణ గలిగియుండవలెనో ఈ సంర్భమున తెలిసికొనుట చాల ముఖ్యమైయున్నది. ఏలయనిన ఇపుడు ప్రపంచములో పెక్కుచోట్లు 'వాచా' జ్ఞానము ప్రబలి అనుష్ఠానము సన్నగిల్లుచున్నది. కొందఱు ధ్యానకాలమున మాత్రము యోగులవలె ప్రవర్తించి, తదుపరి నిత్యజీవనమున భోగులవలె మెలగుచున్నారు. ఇది సరికాదు. ఈ పద్ధతిని భగవానుడు మెచ్చుకొనడు. ఏ శాస్త్రమున్ను ఒప్పుకొనదు.

(1) సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః॥

(2) ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యో2ర్జున।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః॥

అను ఈ రెండు శ్లోకముల ద్వారా శ్రీకృష్ణపరమాత్మ ధ్యాననిష్ఠుని, లేక యోగనిష్ఠుని దైనందినవర్తమును పేర్కొనియుండెను. సమస్త ప్రాణికోట్లయందును సమబుద్ధి కలిగి యుండవలెననియు, సుఖమునందుగాని, దుఃఖమునందుగాని తన వలెనే ఇతరులను గూడ చూచుకొనవలయుననియు పరమాత్మ జనులను హెచ్చరించెను. పూజా జపధ్యానాదులు చేయుచున్నప్పటికిని, నిత్యజీవితము నందీ సర్వభూతదయ, సమత్వబుద్ధి లేనిచో ఆ జపతపాదులకు ఉత్తమ ఫలితము చేకూరదు. వ్యాధి తొలగవలెననిన మందు తినుటతోబాటు పథ్యమును గూడ సరిగా ఆచరింపవలయును గదా! పూజా జపతపధ్యానాదులే మందు. సర్వభూతదయయే పథ్యము. దైవచింతనయే మందు, ధర్మాచరణయే పథ్యము. భవరోగ వినాశమునకు రెండును అవసరములే యని జ్ఞాపకముంచుకొనవలెను.

సర్వభూతదయ అను ఈ గుఱుతును బట్టి ఒక అధ్యాత్మక్షేత్రమున దంబాచారులగు యోగులను (Pseudo Yogins) మిథ్యాచారులగు జనులను, ఉదరనిమిత్త బహుకృతవేషులను చక్కగ కనిపెట్టవచ్చును. ఎవని హృదయమున ప్రాణికోట్ల యెడల కరుణ, దయ, ప్రేమ యుండదో, ఎవని హృదయము కర్కశమై, పాషాణతుల్యముగ నుండునో అట్టి వాడు ఎన్ని పూజలను చేసినను, ఎన్ని ధ్యానముల నాచరించినను, పూర్ణ ఫలితముల నెన్నటికిని బొందజాలడు. అతనిది అనుష్ఠాన వేదాంత మెన్నటికిని కానేరదు. పరప్రాణులను తనవలె జూచుకొనుచు, పరోపకారము, దయ, ప్రేమ, కరుణ మొదలగు ఉదాత్తగుణములు కలిగియుండనిచో, ఇక నాతడు చేసిన ధ్యానము వలన ఫలితమేమి? ఆ ధ్యానము దైవధ్యానమా, లేక దేహధ్యానమా? “సూత్రే మణిగణా ఇవ” అనునట్లు సర్వభూతకోట్ల యందును మణుందు దారము వలె అనుస్యూతుడై వ్యాపించియున్న పరమాత్మను మనస్సులో ధ్యానించిన పిదప బయటకువచ్చి పరప్రాణులకు అపకారము చేసినచో, తానింత వరకు ధ్యానించిన పరమాత్మకు అపకారము, తద్ద్వారా అపచారము చేసినట్లేకదా!

ధ్యానకాలమందలి దైవదృష్టి ధ్యానకాలమువఱకే పరిమితమైయుండరాదని సాధకులు జ్ఞప్తియందుంచు కొందురుగాక! ఆ దృష్టి యెల్లకాలము లందును ఉండవలెను. మరియు భగవంతుడు ధర్మస్వరూపుడు, ధర్మమూర్తి, ధర్మము పతనమైనపుడు దాని నుద్ధరించుటయే అతని పని. ‘శాశ్వత ధర్మగోప్తా’ (ఎల్లప్పుడు ధర్మమును రక్షించువాడు) అను విశేషణము కూడ కలవాడతడు. అట్టి ధర్మస్వరూపుని ధ్యానకాలమందు, పూజాకాలమందు చింతనజేసి తదుపరి బయట ప్రపంచములోనికి వచ్చి అధర్మాచరణ గలిగియుం డినచో అట్టివారు ధర్మద్రోహులేకాదు, దైవద్రోహులు కూడ నగుదురు.

శాంతి, అక్రోధము, మున్నగు దైవిక గుణములు ఇంటిలోని పూజామందిరపు హద్దువరకేయని కొందఱు జనులు తలంచుకొనుచున్నారు. కనుకనే వారు ఇంటిలో యోగులుగను, బయట అసురులుగను ప్రవర్తించుచుందురు. అట్టి వారిని జూచినచో సామాన్య జనులకు పరిమార్థ సంఘము మొత్తము పైననే ఒక విధమైన ఏహ్యాభావము గలుగగలదు. కాబట్టి దైవమార్గావలంబు లందఱును తమ తమ ధ్యాన, పూజా, జప, తపాదులతోబాటు, సర్వభూతదయ, జీవకారుణ్యము మొదలైన పవిత్ర గుణములు కలిగియుండ వలెను.

పాశ్చాత్యదేశములో సౌభ్రాతృత్వము (Brother hodd) అను ధర్మమునకు ఎక్కువ ప్రచారము కలదు. తోటి మానవుని తన సోదరునిగ తలంచుకొని ప్రేమ, సహృదయత కలిగి యుండుటయే ఆ సుగుణము యొక్క అర్థము. పూర్వము ఫ్రాన్స్ దేశమందు చెలరేగిన క్రాంతి (French Revolution) సమయమున ప్రజలు తమ విజయము కొరకు ఎన్నుకొనిన ‘సమత్వము, స్వాతంత్ర్యము, సోదరత్వము (Equality, liberty, Fraternity) అను మూడు నినాదములలో ఈ సౌభ్రాతృత్వము ప్రముఖ స్థానము నాక్రమించియున్నది. కాని హైందవమతము ఈ ‘సోదరత్వము’తో తృప్తిపడలేదు.

ఏలయనగా నూటికి నూఱుపాళ్ళు ప్రేమ అందు కనిపించుటలేదు. సోదరుడు సోదరుడు కలహించుఁజను సంఘటన లెన్నియో వార్తా పత్రికలందు కానవచ్చుచున్నవి. ప్రత్యక్షముగను అట్టివి యెన్నియో ఇరుగు పొరుగులలోనే సంభవించుచున్నవి. ఒక వకీలుగారిని ప్రశ్నించినచో ఇక్కాలమున వారికివచ్చు ఎక్కువ కేసులు సోదరసోదరుల కలహములు, భార్యాభర్తల పేచీలు, తండ్రి కొడుకుల స్పర్ధలు వీనికి సంబంధించినవేయని తడుము కొనకుండ చెప్పివేయును. కాబట్టి సోదరత్వము మంచిదే అయినను చాలదు. ఇంకను పైకిపోయి ఆత్మౌపమ్యత్వమును అలవాటు చేసుకొనవలయును. తన వలెనే సర్వ ప్రాణికోట్లను జూచుకొను శక్తిని సంపాదించవలెను. ఇదియే అనుష్ఠాన వేదాంతము. భగవంతునకు అత్యంత ప్రీతికరమైన ధర్మమిదియే. మోక్షధామమునకు రాజబాటయు నిదియే-

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యో2ర్జున।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః॥
(భగవద్గీత- 6.32)

'సుఖమునందుగాని, దుఃఖమునందుగాని ఎవడు తనవలెనే అందఱిని సమముగ జూచుకొనునో అట్టి యోగి సర్వోత్కృష్టుడని చెప్పబడును'.

భగవద్గీతయంది ఈ శ్లోకము అనుష్ఠాన వేదాంతమును బాగుగ నొక్కి చెప్పుచున్నది. సోదరతవము (బ్రదర్‌హుడ్) ను దాటి ఒక మెట్టు పైకిపోయి గీత 'ఆత్మౌపమ్యత్వము' (నీవలె ఇతరులను జూచుకొనుము) అను మహోన్నత సిద్ధాంతమును ప్రతిపాదించినది. ఆత్మౌపమ్యత్వమనగా నేమి? సుఖ దుఃఖములందుగాని, మఱే పరిస్థితి యందుగాని తనవలె నితరులను జూచుటయే ఆత్మౌపమ్యము. దృష్టాంతమునకు తనకు ఆకలి కలిగినచో 'ఎవరైనా నాకు అన్నము పెట్టిన బాగుండును' అని తలంచును. అట్లే పరులకు దాహము కలిగినపుడు తాను వారికి మంచినీళ్ళివ్వవలెను. తనకు చలిగా నున్నచో 'కప్పుకొనుటకైవరైన నాకు దుప్పటి ఇచ్చినచో బాగుండును' అని మనుజుడు భావించును. అదేవిధముగ ఎవరైన చలిచే బాధపడుచున్నచో వారికి వస్త్రదానమును చేయవలెను. ఇదియే గీతయందు తెలుపబడిన 'ఆత్మౌపమ్య' ధర్మము. ఇదియే ఆచరణ వేదాంతము.

పైన తెలుపబడిన శ్లోకమును ప్రతివారును కంఠస్థముచేసి అర్థమును బాగుగ మననము చేయవలెను. ఈ శ్లోకము గీతకు మకుటమువంటిది. వైరులకు, ద్వేషులకు, సోమరులకు గొడ్డలిపెట్టువంటిది. ఎవడును ఏ కాలమందును, ఏ పరిస్థితి యందును తనపై తాను ప్రీతిలేకయుండడు. మఱియు తనకు దుఃఖమును వాంఛింపడు. కనుకనే గీత, ఉపనిషత్తులు అట్టి 'ఆత్మౌపమ్యము'నే ప్రేమకు, స్నేహమునకు సాదృశ్యముగ తీసికొనినవి. అంతియేకాని 'సోదరత్వము'ను తీసికొనలేదు. ఏలయనిన, సోదరత్వము గొప్ప లక్ష్యమైనను, పవిత్ర ధర్మమైనను, ప్రేమ యొక్క పూర్ణత్వమును, పరాకాష్ఠను అయ్యది దిగ్దర్శనము చేయజాలదు.

Do as you would be done by

"నీవు నీ కేమి యొనర్పదలంచుకొందువో దాని నితరులకు చేయుము" - నిన్ను నీవు సుఖపెట్ట దలంచుచో అట్టి సుఖమును ఇతరులకు నీవు కలగుజేయుము. నీవు హాయిగ నుండదలంచుచో అట్టి హాయిని ఇతరులకున్ను కలుగజేయ యత్నింపుము. 'నన్నెవరును బాధించగూడదు' అని నీవెట్లు తలంచుదువో అట్లే ఇతరులకున్ను నీవు బాధను గలుగజేయకుము'.

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మపథములకెల్లన్.
(మహాభారతము)

భారతమందు తెలుపబడిన ఈ ధర్మమే గీతయందు తెలుపబడిన 'ఆత్మౌపమ్య' దృష్టి, ఇట్టి దృష్టి కలిగియున్నచో ఇక మనజుడు భక్తియందుగాని, యోగమందుగాని, జ్ఞానమందుగాని ఆరితేరినట్లు లెక్క. అది లేనిచో, ఇంకను ఆ యోగములు సరిగ అబ్బలేదని నిర్ణయించుకొనవచ్చును. దేవుని భజించి జీవుని బాధించినచో ఏ ప్రయోజనమున్ను లేదు. నారాయణుని పూజించి నరుని దూషించినచో

లాభములేదు. విష్ణువును ధ్యానించి ధర్మమును ధిక్కరించినచో ఆ ధ్యానమునకు విలువలేదు.

అపహాయ నిజం కర్మ కృష్ణ కృష్ణేతి వాదినః ।
తే హరేర్ద్వేషిణః పాపా ధర్మార్థం జన్మయద్ధరేః॥

సత్యమును, ధర్మమును తృణీకరించి 'కృష్ణా, కృష్ణా' యని నోటితో పలికినంత మాత్రమున ఎవడును భక్తుడు కానేరడు. ఏలయనిని కృష్ణుని జన్మ ధర్మోద్ధరణ కొఱకే అయియున్నది కదా! కావున కృష్ణుని నామ స్మరణతోబాటు కృష్ణుని రూపములేయగు సమస్త ప్రాణికోట్ల యెడల దయగలిగి యుండుటయు నాచరింపవలెను. ఇట్టి అనుష్ఠాన వేదాంతమును ఏ కాలమందును సాధకులు మఱువరాదు.

పూర్వమొక గురువుండెడివాడు. అతనికి ఒక ఆశ్రమము, ఒక శిష్యుడు కూడ నుండెను. శిష్యునకు ప్రతిదినము ఆ గురువు శాస్త్రములను బోధించుచు ఒక రోజు గురుభక్తిని గూర్చి, గురుపూజను గూర్చి, గురుసేవా మహిమను గూర్చి విశేషించి చెప్పెను. మఱునటి రోజున గురువు ఆశ్రమ కార్యార్థము బయటికిపోయి సరిగా మిట్టమధ్యాహ్నము మఠమునకు వచ్చెను. తలుపువేసి యుండెను. శిష్యుడు లోన గురువుగారి పటమునకు పూజ చేయుచుండెను. 'నాయనా! తలుపుతీయి' అని గురువు కేకవేసెను. లోనుండి శిష్యుడు 'స్వామీనా! తలుపుతీయి' అని గురువు కేకవేసెను. లోనుండి శిష్యుడు 'స్వామీ, అష్టోత్తరము పూర్తికాలేదు, పూర్తిచేసి వచ్చెదను' అనెను. 'శంభూ! కాళ్ళు కాలుతున్నవి, త్వరగా తలుపు తీయి' అని మరల గురువు పలికెను. కాని మందమతియగు ఆ శిష్యుడు, 'స్వామీ! పూజమధ్యలో ఎట్లాలేచేది' అని జవాబిచ్చెను. 'ఎవరిపూజ నాయనా' అని గురువడిగెను. 'తమరి పూజయే స్వామీ' అని యా అంతేవాసి బదులు చెప్పెను. చాల సేపటికి ఎట్టకేలకు తలుపుతీసెను. అపుడు గురువు శిష్యుని చీవాట్లు పెట్టి, 'గురువును ఎండగొట్టి గురుపూజ యేమి?" అని మందలించి గురువాక్యమును పాలించుటయే నిజమైన గురుపూజయనియు, దైవప్రోక్తమగు ధర్మమును ఆచరించుటయే నిజమైన దైవపూజయనియు బోధించెను.

ఇట్టి తత్త్వము తెలియక అనేకులు పైపైపూజలు, ధ్యానములు, నమస్కారములు చేయుచు హృదయమును మాత్రము కఠినముగ నుంచుకొనుచున్నారు. కొందఱు ఎవరైన దప్పిక గొన్నవాడు వచ్చి వారిని 'కొద్దిగ మంచినీళు పొయ్యండి మహాప్రభో" అని వేడినప్పటికి 'ఛీ, పొండి' అని ఈసడించుకొనుచుందురు. 'అన్నమో రామచంద్రా!' యని అల్లాడుచు వచ్చిన అన్నాతురుని ద్వేషించి వెడలగొట్టుదురు? (ఇచ్చుటకు శక్తి గలిగి కూడ). ఇవి చిన్న విషయములని యెవరును ఉపేక్షచేయరాదు. పెద్ద పెద్ద పూలకంటె పెచ్చుగ ఇటువంటి పరోపకార సంబంధమైన చిన్న విషయములకే మహాత్ములు ప్రాధాన్యము నొనంగుచుందురు. భగవంతుడున్ను వానినే అధికముగ మెచ్చును.

"The greatness of man lies not in doing great things in a great way, but in doing small things in a great way'

"మనుజుని యొక్క గొప్పతనము పెద్ద పెద్ద కార్యములను ఆర్భాటముగ చేయుటలో లేదు, చిన్న చిన్న కార్యములను గొప్ప మనస్సుతో చేయుటలోనే కలదు'- అని ఆంగ్లభాషలో నొక సామెత కలదు. ఒకడు పరోపకారమును గూర్చి బ్రహ్మాండమైన ఉపన్యాసముచేసి ఇంటికి వెడలుచుండెననుకొనుడు. ప్రక్కనే మఱియొకడు వీధిని బోవుచు రోడ్డుమీద ఒక రాయిపడియుండుట చూచి 'ఇది యెవరికైన తగిలినచో బాధపడుదురు' అని యెంచి దూరముగ పారవేసెననుకొనుడు వీరిరువురిలో రెండవవాడే చాలా గొప్పవాడు. ఒక్క వాక్యము పలుకకున్నను గంభీరమాన ధర్మోపన్యాస మాతడు కావించిన వాడే యగును. ఏలయనగా అతడు బోధించినది అనుభవ వేదాంతము (ప్రాక్టికల్ వేదాంత). ఈ రహస్యములన్నిటిని ఆలోచించియే భగవానుడు గీత ఆరవ అధ్యాయమునందు ధ్యానయోగమును గూర్చి ముందు బోధించినను, అంతటితో వదలిపెట్టక తదుపరి అమూల్యమగు ఆచరణ వేదాంతమును ("ఆత్మోపమ్యేన....." ఇత్యాది శ్లోకముల ద్వారా) గూడ వ్యక్తపఱచెను. మందుతోబాటు పథ్యమును గూడ బోధించెనన్నమాట. ఈ ప్రకారముగ రెండిటిని చెప్పుటవలన బోధసమాప్తమైనది. పరిపూర్ణత్వమును

బొందినది. కావున చిత్తైకాగ్రత ప్రాధాన్యముగ గల ధ్యానయోగమున్ను, సర్వభూతహితాత్మకమగు అనుష్ఠానమున్ను రెండును సాధకునకు అత్యంతావశ్యకములై యున్నవి.

'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి' – (ఏ దేవునకు నమస్కరించినను అది పరమాత్మకే చెందును) అను వాక్యముతోబాటు 'సర్వజీవ తిరస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' – (ఏ ప్రాణిని బాధపెట్టినను అదియు భగవంతునకే తగులును) – అను వాక్యమును గూడ ఎవరును మఱువరాదు. ఇట్టి భావములను మరల మఱల స్మరించుచు ముముక్షువగువాడు తన ధ్యానానుష్ఠానములతోబాటు తన సంధ్యావందన జపప్రార్థనాపూజాది కార్యాములతోబాటు జీవకారుణ్యమును, సర్వభూతదయను, ప్రేమతత్త్వమును, దయార్ద్ర హృదయమును పెంపొందించు కొనుచుండవలెను. వాస్తవముగ విచారించినచో సమస్త భూతకోట్లయందును సర్వేశ్వరుని అస్తిత్వమును అనుభూతమొనర్చుకొనుచు, కరుణ, దయ, ప్రేమాదులను అభివృద్ధిపఱచుకొనుటయే నిజమైన భక్తియగును. కనుకనే శ్రీకృష్ణభగవానుడు 'అద్వేష్టా సర్వభూతానాం' – ఏ ప్రాణిని ద్వేషించనివాడే భక్తుడని, తనకు అత్యంత ప్రియుడని గీత యందు పేర్కొనెను. కాబట్టి విజ్ఞులెల్లరు ఈ ధర్మసూక్ష్మమును లెస్సగ గ్రహించి, తమ ధ్యానాదులతోబాటు తమ నైతిక ప్రవర్తనను గూడ పెంపొందించుకొనుచు, కామక్రోధాదులను రహితమొనర్చు కొనుచు, జీవకారుణ్యముగలవారై, విశాల హృదయులై, సర్వభూతహితత్పరులై, అనుష్ఠానవేదాంతులై ఆదర్శపరులై వర్తించుదురుగాక!



జగద్గురు సభావేదిక

కంటి ఆపరేషన్ చేసుకొన్నవారు

ఆశ్రమ కమిటీ సభ్యులు

వేసవి బాలుర శిబిరము

ॐ

శ్రీ గురుపరమ్పరా స్తోత్రమ్

ఓమ్ సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమామ్
అస్మదాచార్య పర్యన్తాం వందేగురు పరమ్పరామ్॥
ఓమ్ నారాయణం పద్మభువం వసిష్ఠం శక్తి తాపసమ్
పరాశరం చ తత్పుత్రం వ్యాసం వేదాబ్జ భాస్కరమ్॥
ఓమ్ విరక్తం శ్రీశుకం దేవం జ్ఞానవైరాగ్యరూపిణమ్
గౌడపాదం చ గోవిన్దం యోగీన్ద్రం జ్ఞానినాం వరమ్॥
ఓమ్ తచ్ఛిష్యం శంకరాచార్యం అద్వైతస్థాపకం గురుమ్
తచ్ఛిష్యాన్పద్మపాదాదీన్ శ్రౌత తత్త్వార్థబోధకాన్॥
అస్మదాచార్య పర్యన్తాం వందే గురుపరమ్పరామ్॥
ఓమ్ శ్రుతిస్మృతి పురాణానామాలయం కరుణాలయమ్
నమామి భగవత్పాదం శంకరం లోకశంకరమ్॥
ఓమ్ బ్రహ్మణేమూర్తిమతే శ్రుతానాం శుద్ధిహేతవే
నారాయణయతీన్ద్రాయ తస్మైశ్రీ గురువే నమః॥
ఓమ్ శ్రీ నారాయణ శిష్యాగ్రం జ్ఞానవైరాగ్య రూపిణమ్
నమామి భగవత్పాదం శివలింగ గురుంమునిమ్॥
ఓమ్ యుక్తాహార విహారాయ వివిక్త స్థలవాసినే
అసంగానందయతయే స్వామినే తే నమో నమః॥
ఓమ్ విద్యాప్రకాశ నామానం వేదవేదాన్త కోవిదమ్
గీతా తత్త్వప్రబోద్ధారం సద్గురుం ప్రణమామ్యహమ్॥
ఓమ్ అసంగానందగుర్వాద్యాం విద్యాప్రకాశ మధ్యమామ్
అస్మదాచార్య పర్యన్తాం వందేగురు పరమ్పరామ్॥

ఓమ్ తత్సత్

శ్రీశ్రీశ్రీ సద్గురు మళయాళ స్వాముల వారు



గీతా పరీక్షలో ఉత్తీర్ణత సాధించినందుకు ప్రథమ బహుమతి పొందిన విద్యార్థిని

గిరిజన విద్యార్థులకు సన్మానము

ఉత్తర పీఠాధిపతి పూజ్యశ్రీ సంపూర్ణానందగిరి స్వాముల వారు

కంటి ఆసుపత్రి నూతన భవనం

శ్రీ విద్యా ప్రకాశానంద స్వామీజి ధ్యాన మందరము

Sri Vidya Prakasananda Swamiji Dyana Mandir

Aruna Graphics, Nlr. Ph : 2325526